
మంగాపురం కాలనీలో కూలిన చెట్టు

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

విశాఖపట్నం

జిల్లా వార్తలు

శనివారం 4 అక్టోబరు 2025



పెనుగాలుల బీభత్సం

గంటకు 66 కి.మీ. వేగంతో గాలులు

నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగ్‌లు

- పలుచోట్ల రోడ్లపై నిలిపి ఉన్న కార్లు, ద్విచక్ర వాహనాలకు నష్టం
- రాకపోకలకు తీవ్ర అంతరాయం
- హుద్‌హుద్‌ను తలపించిన వైనం

విశాఖపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): **నగరంలో గురువారం పెనుగాలులు బీభత్సం సృష్టించాయి. దసరా రోజు ఉదయం 11 గంటల సమయాన వీచిన గాలులు హుద్‌హుద్ తుఫాన్‌ను తలపించాయి. ఎక్కడికక్కడే చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. హోర్డింగ్‌లు కింద పడ్డాయి. కార్లు, ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. వీధుల్లో రాకపోకలు నిలిచి పోయాయి.**

గురువారం ఉదయం 11 గంటల సమయంలో 66 కి.మీ. వేగంతో కొద్ది నిమిషాలు వీచిన గాలులు తీవ్రనష్టం చేకూర్చాయి. ముఖ్యంగా హుద్‌హుద్ సమయంలో వీధుల్లో వేసిన మొక్కలు ఏపుగా పెరిగి చెట్లుగా మారాయి. పెనుగాలులకు వాటిలో అనేకం వేళ్లతో సహా కూలిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో కొమ్మలు విరిగిపడ్డాయి. తూర్పు నియోజకవర్గంలోని మద్దిలపాలెం, ఎంవీపీ కాలనీ, ఇసుకతోట, శివాజీపాలెం, ఈస్ట్ పాయింట్ కాలనీ, సర్క్యూట్ హౌస్, ఉత్తర నియోజకవర్గంలో అక్కయ్యపాలెం, సీతమ్మధార, కంచరపాలెం, మాధవధార, మర్రిపాలెం, బిర్లా జంక్షన్ తదితర ప్రాంతాల్లో ఎక్కువ నష్టం జరిగింది.

జీవీఎంసీ అధికారుల లెక్కల ప్రకారం 80 ప్రాంతాల్లో 168కి పైగా చెట్లు నేలకూలాయి. మరికొన్ని ... మిగతా 6వ పేజీలో


నగరంలోని ద్వారకా నగర్ ప్రాంతంలో వాహనంపై పడిన చెట్టు


మద్దిలపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో కూలిన చెట్టు, గోడ


ద్వారకానగర్ మెయిన్ రోడ్డులో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

విద్యుత్ శాఖకు రూ.10.98 లక్షల నష్టం

- 65 ప్రాంతాల్లో నేలకొరిగిన స్తంభాలు
- యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ

విశాఖపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో వర్షాలు, పెనుగాలుల వల్ల విద్యుత్ శాఖకు రూ.10.98 లక్షల నష్టం వాటిల్లింది. సర్కిల్ పరిధిలో 65 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విశాఖ సర్కిల్‌లో మూడు డివిజన్లు ఉండగా చాలాచోట్ల విద్యుత్ లైన్లపై భారీవృక్షాలు, విరిగిన కొమ్మలు పడి విద్యుత్ వ్యవస్థకు నష్టం వాటిల్లింది. సర్కిల్ పరిధిలో 33 కేవీ ఫీడర్లు మొత్తం 95 ఉండగా వాటిలో 39 దెబ్బతిన్నాయి. 11 కేవీ ఫీడర్లు 574 ఉండగా వాటిలో 120 పాడయ్యాయి. వీటన్నింటిని యుద్ధప్రాతిపాదికన పునరుద్ధరించామని సర్కిల్ ఎస్ఈ జి.శ్యాంబాబు శుక్రవారం తెలిపారు. సీతమ్మధార, మర్రిపాలెం, సాగర్ నగర్ ప్రాంతాలు బాగా ప్రభావితమయ్యాయని, అక్కడే ఎక్కువ నష్టం జరిగిందన్నారు.

స్వచ్ఛాంధ్ర పురస్కారాలు

జిల్లాలో ఏడింటికి రాష్ట్రస్థాయి అవార్డులు

- ఆరో తేదీన సీఎం చేతుల మీదుగా ప్రదానం
- స్వచ్ఛ మునిసిపాలిటీ కేటగిరీలో జీవీఎంసీకి అవార్డు
- స్వచ్ఛ కాలనీల కేటగిరీలో తిరుమలనగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు...
- స్వచ్ఛ రైతుబజార్‌ల కేటగిరీలో ఎంవీపీ రైతుబజార్‌కు



విశాఖపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ లక్ష్యానికి అనుగుణంగా ముందుకు సాగుతున్నది. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది అందిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ పురస్కారాల తరహాలో రాష్ట్రస్థాయిలో స్వచ్ఛ ఆంధ్ర పురస్కారాలను వివిధ విభాగాలకు అందజేయనున్నది. ఈ ఏడాది జిల్లాలోని ఏడు సంస్థలు/కార్యాలయాలకు రాష్ట్రస్థాయి అవార్డులు లభించాయి. అవార్డుల వివరాలను ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. స్వచ్ఛ మునిసిపాలిటీ కేటగిరీలో జీవీఎంసీకి అవార్డు వచ్చింది. అలాగే స్వచ్ఛ కాలనీల కేటగిరీలో కూర్మన్నపాలెంలోని తిరుమలనగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు, చిన్నతరహా పరిశ్రమలకు సంబంధించి 'లోటస్ వైర్‌లెస్ టెక్నాలజీస్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్'కు, స్వచ్ఛ రైతుబజార్‌ల కేటగిరీలో ఎంవీపీ రైతుబజార్‌కు, స్వచ్ఛ పాఠశాలల కేటగిరీలో పెదగంట్యాడలోని నడుపూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు, స్వచ్ఛ ఎస్ఎల్ఎఫ్ఎస్ కేటగిరీలో సింహగిరి కాలనీ మహిళా సమాఖ్యకు, స్వచ్ఛ గ్రామ సమాఖ్య అవార్డు పెందుర్తి మండలం గొరపల్లికి లభించింది. విజయవాడలో ఈ నెల 6న సీఎం చంద్రబాబునాయుడు పురస్కారాలను ప్రదానం చేయనున్నారు.

జిల్లా స్థాయి అవార్డులు...

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం అమలులో జిల్లాకు ఏడు రాష్ట్ర స్థాయి అవార్డులు రావడం ... మిగతా 6వ పేజీలో

మహిళా క్రికెట్ సందడి

- ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఐదు వరల్డ్ కప్ మ్యాచ్‌లు
- 9న భారత్, దక్షిణాఫ్రికా మధ్య తొలి మ్యాచ్
- ఆన్‌లైన్‌లో టికెట్ల అమ్మకాలు



వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్, సీపీ, జీవీఎంసీ కమిషనర్

విశాఖపట్నం-స్పోర్ట్స్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఐసీసీ మహిళల వరల్డ్ కప్ టోర్నీలో భాగంగా ఏసీఏ-వీడీసీఏ స్టేడియం వేదికగా అక్టోబరు 9 నుంచి జరగనున్న ఐదు మ్యాచ్‌లకు టికెట్ల అమ్మకాలు ఆన్‌లైన్ (బుక్ మై షో)లో మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. స్టేడియంలోని సి, డి, ఈ, ఈ1, ఎఫ్, జి, హెచ్, కె, ఐ, కె, ఎం స్టాండ్స్‌కు సంబంధించిన టికెట్లను (రూ.100), అలాగే ప్లేయర్ పెవెలియన్ వైపు గల సౌత్ వెస్ట్ అప్పర్, సౌత్ ఈస్ట్ అప్పర్ స్టాండ్‌లకు (గ్యాలరీ) సంబంధించి ... మిగతా 6వ పేజీలో

మ్యాచ్‌లు...

అక్టోబరు 9న భారత్-దక్షిణాఫ్రికా, 12న భారత్-ఆస్ట్రేలియా, 13న దక్షిణాఫ్రికా-బంగ్లాదేశ్, 16న ఆస్ట్రేలియా-బంగ్లాదేశ్, 26న ఇంగ్లండ్-న్యూజిలాండ్ మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి.

చికెన్ వ్యర్థాలపై పోలీస్ పంచాయితీ

అనధికారికంగా చికెన్ వ్యర్థాలు సేకరిస్తున్న వైసీపీ చోటా నేత

పోలీస్ కమిషనర్‌కు కూటమికి చెందిన ప్రజా ప్రతినిధితో పాటు కాంట్రాక్టర్ల ఫిర్యాదు


- విచారణ జరపాలని టాస్క్‌ఫోర్స్ అధికారులను ఆదేశించిన సీపీ
- స్టేషన్‌కు పిలిపించిన పోలీసులు
- కాంట్రాక్టర్లను బెదిరిస్తే చర్యలు తప్పవని వార్నింగ్
- అతడిని విడిచిపెట్టాలని టాస్క్‌ఫోర్స్ అధికారికి కూటమి నేత ఫోన్
- విచారించిన తర్వాత విడిచిపెడతామని సమాధానం చెప్పడంతో ఆగ్రహం
- ఇరువురి మధ్య వాగ్వాదం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి) **చికెన్ వ్యర్థాల సేకరణ వ్యవహారం ఇప్పుడు కూటమి నేతకు, పోలీసులకు మధ్య వివాదానికి దారితీసింది. నగరంలో చికెన్ వ్యర్థాల సేకరణకు టెండర్లు దక్కించుకున్న తమను కొందరు బెదిరిస్తున్నారన్న కాంట్రాక్టర్ల ఫిర్యాదు మేరకు వైసీపీ చోటా నేతను టాస్క్‌ఫోర్స్ పోలీసులు విచారణకు పిలవడం కూటమి నేత ఒకరికి ఆగ్రహం తెప్పించింది. టాస్క్‌ఫోర్స్ పోలీసులకు ఫోన్ చేసి అతడిని విడిచిపెట్టాలని ఆదేశించారు. ఈ క్రమంలో కూటమి నేతకు, పోలీస్ అధికారికి మధ్య వాగ్వాదం జరిగినట్టు ప్రచారం జరుగుతోంది.**

నగరంలో చికెన్ దుకాణాల వద్ద వ్యర్థాలను కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు తరలించేందుకు జీవీఎంసీ జోన్‌ల వారీగా టెండర్లు పిలిచింది. ఈ వ్యవహారంలో ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకుని తమ అనుచరులు, తమను ప్రసన్నం చేసుకున్న వారికి ఇవ్వాలని అధికారులపై ఒత్తిడి తెచ్చారు.


చికెన్ వ్యర్థాలు

చివరకు ఏదోలా టెండర్ల ప్రక్రియను అధికారులు పూర్తిచేసినప్పటికీ వివాదాలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. చికెన్ దుకాణాల నుంచి సేకరించిన వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలించాల్సిన కాంట్రాక్టర్లు కొందరు వాటిని చేపల చెరువులకు విక్రయించి సొమ్ము చేసుకుంటుంటారు. వైసీపీ హయాంలో ఈ దందా తారస్థాయికి చేరింది. అప్పుడు చికెన్ వ్యర్థాల సేకరణ ద్వారా భారీగా ఆర్జించిన ఆ పార్టీ చోటా నేత ఒకరు... ఇప్పుడు కూడా దానిని కొనసాగించాలని భావించారు. అనుకున్నదే తడవుగా వైసీపీకి చెందిన మాజీ మంత్రి ద్వారా కూటమి నేత ఒకరిని ప్రసన్నం చేసుకున్నారు. ఆయన ... మిగతా 6వ పేజీలో


స్వర్ణాభరణాలు, వివిధ రకాల ఫలాలంకరణలో కనకమహాలక్ష్మి

కనకమహాలక్ష్మి

విజయదశమి రోజు స్వర్ణాభరణ భూషితగా దర్శనం

వన్‌టౌన్ బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం విజయదశమి సందర్భంగా అమ్మవారు స్వర్ణాభరణాలతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అనేక రకాల మధుర ఫలాలతో అర్చకులు అమ్మవారిని అలంకరించారు. అనంతరం సహస్రనామార్చన నిర్వహించారు. - మహారాణిపేట, ఆంధ్రజ్యోతి

ఇస్కాన్‌లో ఘనంగా దసరా సంబరాలు


దహనమవుతున్న రావణుడి దిష్టిబొమ్మ

- 50 అడుగుల రావణ దిష్టిబొమ్మ దహనం

సాగర్‌నగర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇస్కాన్‌లో గురువారం దసరా సంబరాలు వైభవంగా జరిగాయి. ఉదయం సీతారామ,లక్ష్మణ, హనుమన్‌లకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఏర్పాటుచేసిన రామ కథామృతం, రామ గానామృతం, కీర్తనలు భక్తులను తన్మయత్వంలో ఓలలాడించాయి. సాయంత్రం అదే ఆవరణలో దుష్ట శిక్షణ, శిష్ట రక్షణలో భాగంగా ఏర్పాటుచేసిన 50 అడుగుల రావణాసురుడి దిష్టి బొమ్మను ఎంపీ ఎం.శ్రీభరత్, ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాసు దహనం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ విల్లు ఎక్కుపెట్టి రావణ దిష్టిబొమ్మకు శర సంధానం చేశారు. సంబరాల్లో భాగంగా ఏర్పాటుచేసిన ప్రత్యేక ఫైర్ క్రాకర్స్ షో, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. రామలీలపై చేసిన ప్రవచనం పరవశులను చేసింది. వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో ఇస్కాన్ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. కార్యక్రమం అనంతరం భక్తులందరికీ నిర్వాహకులు ప్రసాద వితరణ చేశారు.

గూగుల్ డేటా సెంటర్‌కు మోకాలడ్డు!

- తర్లువాడలో భూసేకరణకు దళారుల అడ్డంకులు
- రైతులను రెచ్చగొట్టేందుకు యత్నాలు
- తీవ్రంగా పరిగణిస్తున్న ప్రభుత్వం
- లావాదేవీలపై విచారణకు నిర్ణయం?


తర్లువాడలో భూములు

విశాఖపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): **గూగుల్ డేటా సెంటర్ కోసం ఆనందపురం మండలం తర్లువాడలో అధికార యంత్రాంగం చేపట్టిన భూసేకరణకు కొందరు బ్రోకర్లు మోకాలడ్డుతున్నారు. వైసీపీ హయాంలో అప్పటి పాలకుల దన్నుతో అక్కడ భూముల కొనుగోలుకు అడ్వాన్స్‌లు ఇచ్చిన బ్రోకర్లు ఇప్పుడు తెర వెనుక ఉండి కొందరు రైతులను రెచ్చగొడుతున్నారు. దీనిని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తూ బ్రోకర్ల లావాదేవీలపై పూర్తిస్థాయిలో విచారణకు యోచిస్తోంది.**

గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నేతలు, కొందరు ఉన్నతాధికారులు నగర శివారు ప్రాంతంలోని పెందుర్తి, ఆనందపురం, పద్మనాభం, భీమిలి మండలాల్లో భారీగా డీపట్టా భూములు కొనుగోలు చేశారు. ఫ్రీ హోల్డ్ అనుమతులు వచ్చిన భూములకు పూర్తిగా సొమ్ములు చెల్లించిన బ్రోకర్లు, అందుకు ప్రతిపాదించిన భూములకు అడ్వాన్స్‌లు ఇచ్చారు. ఇలా ఆనందపురం మండలం తర్లువాడలో డీపట్టా భూములు, రైతుల ఆక్రమణలో ఉన్న భూములకు సంబంధించి సుమారు 30 నుంచి 40 మందికి అడ్వాన్స్‌లు ఇచ్చారు. ఈలోగా ప్రభుత్వం మారడం, ఫ్రీహోల్డ్ వ్యవహారంపై ఆంక్షలు విధించడంతో బ్రోకర్లు జోరు తగ్గించారు. అయితే అడపాదడపా గ్రామాల్లో అడ్వాన్స్‌లు ఇచ్చిన రైతులను కలిసి మాట్లాడుతున్నారు. కాగా తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు నిర్ణయించడంతో జిల్లా యంత్రాంగం అక్కడ భూముల తాజా స్థితిపై సర్వే చేసింది. రెవెన్యూ, ఉద్యానవన, వ్యవసాయ శాఖ సిబ్బంది ... మిగతా 6వ పేజీలో

నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

విశాఖపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం చైర్‌పర్సన్ అధ్యక్షతన జరగనుందని, ఈ మేరకు ఏర్పాట్లు పూర్తిచేశామని సీఈవో పి.నారాయణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, అన్ని విభాగాల అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలన్నారు.

బవేరియా ముఠా సభ్యుడి అరెస్టు

- దేశంలోనే అత్యంత ప్రమాదకరమైన గ్యాంగ్
- నిందితుడిపై దేశవ్యాప్తంగా 24 కేసులు
- గత నెల 17న నగరంలో వరుస చోరీలు
- చాకచక్యంగా అరెస్టు చేసిన నగర పోలీసులు

-8లో

నగరంలో వరుస చైన్ స్నాచింగ్‌లకు పాల్పడిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన బవేరియా ముఠా సభ్యుడిని అరెస్టు చేసినట్టు డీసీపీ లతామాధురి తెలిపారు.



రైతుతో మాట్లాడుతున్న బృంద సభ్యులు

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలు పరిశీలన

ఆనందపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) :తర్లువాడలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ (ఆర్‌వైఎస్‌ఎస్) బృందం శుక్రవారం సందర్శించింది. సంస్థ ప్రతినిధులు బి. శ్రీనివాస్ చక్రవర్తి, రామారావు, ఎంపీ శ్రీభరత్‌తో కూడిన బృందం ఏ గ్రేడ్, ఎనీ టైమ్ మనీ (ఏటీఎం) మోడల్స్‌ను పరిశీలించి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల లభిస్తున్న ఆదాయం, పంటల సాగుకు చేస్తున్న ఖర్చుపై ఆరా తీశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు సుస్థిరమైన ఆదాయం లభిస్తుందన్నారు. ప్రతిఒక్కరూ ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బృందం సభ్యులు ప్రకాశ్, అలంశెట్టి మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఎంవీవీఎస్ మూర్తికి నివాళులు



నివాళి అర్పిస్తున్న ఎంపీ శ్రీభరత్, తదితరులు

సాగర్‌నగర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి అండ్ మేనేజ్‌మెంట్ (గీతం) విద్యాలయాన్ని స్థాపించడానికి జాతిపిత మహాత్మా గాంధీ స్ఫూర్తి అని గీతం విద్యా సంస్థల అధ్యక్షుడు, ఎంపీ శ్రీభరత్ అన్నారు. శుక్రవారం గీతం వద్ద జరిగిన స్వర్గీయ ఎంవీవీఎస్ మూర్తి వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మూర్తి సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చి పారిశ్రామిక, రాజకీయ, విద్యా రంగాల్లో తనదైన ముద్ర వేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో గీతం విద్యా సంస్థల ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం. గంగాధర రావు, గీతం వర్సిటీ ప్రో వైస్ ఛాన్స్‌లర్ వై. గౌతమ్‌రావు, జీమ్‌సర్ ప్రో వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ బి.గీతాంజలి, వివిధ కళాశాలల డీన్‌లు, ప్రిన్సిపాళ్లు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

98వ వార్డులో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు

సింహాచలం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 98వ వార్డులోని పలు ప్రాంతాల్లో జీవీఎంసీ నిధులతో హైమాస్ట్ లైట్లు ఏర్పాట్లు చేశారు. వీటిని వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం శుక్రవారం ప్రారంభించారు. వార్డులోని అడివివరం, గాంధీనగర్, విజినిగిరిపాలెం, బంగారమ్మగుడి, సాయినగర్, పద్మావతినగర్, భూలోకనగర్, గోసాల్ లేఅవుట్, లక్ష్మీనరసింహనగర్‌లో ఈ లైట్లు ఏర్పాటు చేశారు.

రేవిడి పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్ఓ

పద్మనాభం రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల వైద్యులు బుధవారం నుంచి సమ్మె బాట పట్టడంతో ప్రత్యామ్నాయంగా ఎస్పీఎంసీ వైద్యులతో రోగులకు సేవలందించామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జగదీశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన రేవిడి పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరుపట్టికను పరిశీలించారు. కొంతమంది సంతకాలు లేకపోవడంతో అధికారులను ప్రశ్నించారు. అలాగే పీహెచ్‌సీ నిర్వహణకు సంబంధించిన పలు రికార్డులను కూడా పరిశీలించారు.

వినియోగంలోకి మెట్ల మార్గం



మెట్ల మార్గంలో రాకపోకలు సాగిస్తున్న భక్తులు

సింహాచలం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై జోడుభద్రాల వద్ద ఈఏడాది చందనోత్సవం నాడు కూలిన గోడ స్థానంలో రూ. 18 లక్షలతో నూతనంగా మరో గోడ నిర్మించారు. విజయదశమి పురస్కరించుకుని గురువారం నుంచి ఈ మార్గంలో భక్తుల రాకపోకలకు అనుమతించారు. గోడ కూలిన తరువాత (ఏప్రిల్ 30) నుంచి ఈ మార్గంలో భక్తుల రాకపోకలను నిలిపివేయడంతో దేవస్థానానికి చెందిన దుకాణ సముదాయంలో వ్యాపారాలు స్తంభించాయి. మళ్లీ మార్గం తెరవడంతో వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జీఎస్టీ తగ్గుదలతో రైతులకు మేలు

పద్మనాభం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ ఉత్పత్తులపై జీఎస్టీ తగ్గింపు వల్ల రైతులకు మేలు జరుగుతుందని మండల ప్రత్యేక అధికారిణి జ్ఞానవేణి అన్నారు. శుక్రవారం ఆమె బాందేవుపురంలో రైతులకు జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయూత నివ్వడం సంతోషించదగ్గ విషయమన్నారు. అనంతరం సచివాలయాన్ని, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అలాగే విజయరాంపురంలో కాలనీ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి సకాలంలో పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఆనందరావు, ఎంపీడీవో రూపూశ్, ఏఓ చలం, ఆర్ఐ శ్యామల, సర్పంచ్ ఆదిలక్ష్మి, పంచాయ కార్యదర్శి పైడయ్య, తదితరులు పాల్గొన్నారు.

వివాహితను వేధించిన వ్యక్తి అరెస్టు

ఎండాడ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : వివాహేతర సంబంధాన్ని కొనసాగించేందుకు నిరాకరించిన మహిళను వాట్సాప్ చాట్‌తో వేధిస్తున్న వ్యక్తిని సైబర్ క్రైమ్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. భీమిలికి చెందిన మోహన్‌కుమార్ నగరానికి చెందిన వివాహితతో పెళ్లికి ముందు తీసుకున్న ఫొటోలను ఆమె భర్తకు వాట్సాప్, ఇతర మాధ్యమాల ద్వారా పంపించి వేధించాడు. వివాహిత ఫిర్యాదు మేరకు మోహన్‌కుమార్ ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

మహిళా క్రికెట్ సందడి

... 5వ పేజీ తరువాయి

టికెట్ల (రూ.499)ను ఆన్‌లైన్‌లో అమ్మకాలకు ఉంచారు.

భారత్, దక్షిణాఫ్రికా మ్యాచ్‌కు టికెట్ ధర రూ.150

మ్యాచ్‌ల ఏర్పాట్లలో భాగంగా శుక్రవారం స్టేడియంలో కలెక్టర్ హరేంధరప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి, డీసీపీ-2 మేరీ ప్రశాంతి, ఏసీఏ ప్రతినిధులు సమావేశమ య్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరేంధర్‌ప్రసాద్ మాట్లాడుతూ స్టేడియం చుట్టూ తగిన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ సీసీ టీవీ నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏసీఏ ప్రతినిధులు మాట్లాడుతూ టికెట్ ధర ఈనెల 9న భారత్, దక్షిణాఫ్రికా మధ్య జరగనున్న మ్యాచ్‌కు రూ.150గా, మిగిలిన మ్యాచ్‌లకు రూ.100గా నిర్ణయించామన్నారు.

ఈదురుగాలులకు కూలిన చెట్లు



కొమ్మాది : కార్పెంటర్స్ కాలనీలో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు



విశాలాక్షినగర్ పోలీసు క్వార్టర్స్‌లో చెట్లను తొలగించిన సిబ్బంది

కొమ్మాది, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ పరిసర ప్రాంతాల్లో గురువారం ఉదయం భారీ ఈదురుగాలులతో పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి పలుచోట్ల చెట్లు కూలిపోయాయి. 5వ వార్డులోని కార్పెంటర్స్ కాలనీ రోడ్డులో పెద్ద చెట్టు రహదారికి అడ్డంగా పడిపోవడంతో వైఎస్సార్, కార్పెంటర్స్ కాలనీలకు వెళ్లే ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం మధ్యాహ్నం 12 వరకు చెట్టు తొలగించలేదు. అలాగే 6వ వార్డులో కూడా పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. ఈదురుగాలులతో పాటు వర్షం కురవడంతో గంటల కొద్ది విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

సాగర్‌నగర్ : సాగర్‌నగర్, రుషికొండ తీర ప్రాంతాల్లో బీభత్సమైన ఈదురుగాలులు వీసాయి. సాగర్‌నగర్ కాలనీలో కొన్ని రహదారులు విరిగిపడిన చెట్ల కొమ్మలతో నిండిపోయాయి.హెచ్‌ఐజీ వన్-ఏ- బ్లాక్‌లో భారీ వృక్షం నేలకొరగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

సింహాచలం : సింహగిరిపై భారీ వర్షం కురిసింది. వర్షంతో పాటు ఈదురుగాలలు వీచాయి. గాలుల తీవ్రతకు అప్పన్న ఆలయ వెనుక వైపు ఉన్న తూర్పు మాడ వీధుల్లో కొన్ని చెట్లు విరిగిపడ్డాయి. భక్తుల వసతి కోసం సింహగిరి బస్టాండ్, ఆలయ ధ్వజ స్తంభం, ఇతర ప్రాంతాల్లో దేవస్థానం వేసిన పెండాళ్లు కూడా ఒరిగిపోయాయి.

ఎండాడ : జీవీఎంసీ 8, 9 వార్డుల్లో పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. ఎండాడ లా కళాశాల రోడ్డును కలుపుతూ ఎండాడ నుంచి శ్రీరామ్ ప్రాపర్టీస్‌కి వెళ్లే మార్గంలో చెట్టు పడిపోవడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు.విశాలాక్షినగర్ పోలీస్ క్వార్టర్స్‌లోనూ భారీగా చెట్లు పడిపోవడంతో జీవీఎంసీ సిబ్బంది తొలగించారు.

భీమునిపట్నం : పట్టణంలో వీచిన ఈదురుగాలులకు చెట్లు, ఫ్లెక్సీలు నేలకూలాయి. నోవాటెల్ వద్ద విద్యుత్ తీగలపై చెట్టు పడింది.అలాగే మార్కెట్ యార్డు సమీపంలో, చేపలుప్పాడ, పాతపరదేశిపాలెం రోడ్‌లో చెట్ల కొమ్మలు కరెంటు తీగలపై పడ్డాయి. దీంతో ఆయా ప్రాంతాలకు సరఫరా నిలిచిపోయింది.



హెచ్‌ఐజీ వన్‌ఏ గృహ సముదాయంలో నేలకొరిగిన భారీ వృక్షం



సింహగిరిపై ఆలయ వెనుక కూలిన చెట్ల కొమ్మలు

సేవలకు ‘స్వచ్ఛ’మైన గుర్తింపు

మధురవాడ ఆయుర్వేద ఆస్పత్రికి స్వచ్ఛతా అవార్డు

మధురవాడ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర (సనా) కార్యక్రమంలో మధురవాడ ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రికి అవార్డు లభించింది. మధురవాడ వీహెచ్‌సీ ఆవరణలో ఉన్న ఈ ఆస్పత్రి పరిసరాలు ఆహ్లాదకరంగా ఉండడంతో పాటు లోపల విభాగాలు పరిశుభ్రంగా ఉంటాయి. రోగులకు ఆస్పత్రికి వచ్చామన్న అనుభూతి కలగకుండా సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. వైద్య సేవల్లో కూడా శ్రద్ధ చూపిస్తున్నారు. సనా కమిటీ సభ్యులు ఆస్పత్రిని మూడుసార్లు పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందించారు. పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ఇతర అంశాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం గాంధీ జయంతి పురస్కరించుకుని ఈ ఆస్పత్రికి అవార్డు ప్రకటించింది. ఈ సందర్భంగా ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మజ్జి సుమ ‘ఆంధ్రజ్యోతి’తో మాట్లాడుతూ ఆస్పత్రి పరిసరాలతో పాటు రోగులు వేచి ఉండే స్థలం, మందులు ఇచ్చే ప్రాంతం, వైద్య పరీక్షలు చేసే ప్రదేశం నిత్యం పరిశుభ్రంగా ఉంచుతున్నామని చెప్పారు. తడి, పొడి చెత్తను వేరు చేసి జీవీఎంసీ పారిశుధ్య సిబ్బందికి అందిస్తున్నామని తెలిపారు. ఆస్పత్రి లోపల కర్టెన్లతో పాటు ప్రతి ప్రదేశాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో ప్రభుత్వం స్వచ్ఛ అవార్డు అందజేసిందని పేర్కొన్నారు.





మధురవాడలోని ఆయుర్వేద ఆస్పత్రి (ఇన్‌సెట్లో) మెడికల్ ఆఫీసర్ సుమ

ఘనంగా గాంధీ జయంతి



సీపీఐ కార్యాలయంలో గాంధీజీకి నివాళులు అర్పిస్తున్న నాయకులు

భీమునిపట్నం/తగరపువలస, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో పలుచోట్ల జాతి పిత మహాత్మా గాంధీ 156వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. భీమిలిలో బీచ్‌రోడ్‌లో ఉన్న గాంధీజీ పార్క్‌లో మహాత్ముడి విగ్రహానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, ఆ పార్టీ కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భీమిలి ప్రింట్ మీడియా అసోసియేషన్ సభ్యులు కూడా గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. చిట్టివలస సీపీఐ కార్యాలయంలో గాంధీజీ జయంతి నిర్వహించారు. పార్టీ నాయకుడు రాంబాబు మహాత్ముడు దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

సాగర్‌నగర్ : గాంధీ మార్గం ప్రపంచానికి శాంతియుత పరిష్కారాలు చూపిస్తుందని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు అన్నారు. వర్సిటీలో జరిగిన గాంధీ జయంతిలో ఆయన మాట్లాడారు. సత్యం, ధర్మం, అహింస ఆధారంగా ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపించే శక్తి ఒక్క గాంధీ మార్గానికి మాత్రమే ఉందని చెప్పారు. అనంతరం ఆయన గాంధీ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గీతం విద్యా సంస్థల ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం. గంగాధరరావు, గీతం కార్యదర్శి ఎం. భరద్వాజ, గీతం సలహాదారు ప్రొఫెసర్ జి. సూర్యనారాయణ, గీతం సీఈఓ మీనా, జీమ్‌సర్ ప్రో వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ బి. గీతాంజలి, తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం రూరల్ : అనంతవరంలో గాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. పలువురు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భీమిలి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి పెద ఎర్నినాయుడు, సర్పంచ్ గొర్రెపాటి వెంకటలక్ష్మి, వార్డు సభ్యులు సిద్ధనాతి రమణయ్య,టీడీపీ గ్రామ అధ్యక్షుడు సిద్ధనాతి వెంకటరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అప్పల సూర్యనారాయణ, గోవింద్, తాతాజీ పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర పురస్కారాలు

... 5వ పేజీ తరువాయి

సంతోషంగా ఉందని కలెక్టర్ హరేంధిరప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో విలేకరులతో మాట్లాడుతూ జిల్లా స్థాయిలో 42 విభాగాలకు అవార్డులు ప్రకటించినట్టు పేర్కొన్నారు. ఈనెల ఆరో తేదీన అవార్డులను జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీబాలవీరాంజనేయస్వామి ప్రదానం చేస్తారన్నారు.

స్వచ్ఛ పంచాయతీలు : పెద్దిపాలెం, నగరంపాలెం, తాటితూరు, గంభీరం, వేములవలస

స్వచ్ఛ స్లమ్ లెవెల్ ఫెడరేషన్లు : బాలాజీరావుపేట శ్రీ ఎంఏసీఎస్, శ్రీసంపత్ వినాయక

స్వచ్ఛ గ్రామ స్థాయి ఆర్గనైజేషన్స్: పాలవలస, మజ్జివలస, కొవ్వాడ, పొట్నూరు

స్వచ్ఛ బస్ స్టేషన్: ద్వారకా బస్‌స్టేషన్

ఉత్తమ ఎన్జీవోలు : సెంటర్ ఫర్ యూత్ డెవలప్‌మెంట్ అండ్ యాక్టివిటీస్ (ఆనందపురం), శ్రీతిరుమల నగర్ (జీవీఎంసీ).

ఆస్పత్రులు: కణితి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, జీవీఎంసీలో 56వ వార్డు, మధురవాడలోని జీఏడీ

పాఠశాలలు: వేపగుంట, అగనంపూడి ఉన్నత పాఠశాల, గాంధీగ్రామ్ మునిసిపల్ ఉన్నత పాఠశాల, భీమిలి కేజీబీవీ

అంగన్‌వాడీ కేంద్రాలు: సంజయ్‌గాంధీ కాలనీ, విజయపురం (విశాఖ), మజ్జివలస, తాళ్లవలస (భీమిలి), 77వ వార్డు (విశాఖ రూరల్)లోని కేంద్రాలు

ప్రభుత్వ కార్యాలయాలు: జిల్లా పరిషత్ కార్యాలయం, భీమిలి జోనల్ కార్యాలయం, పెందుర్తిలోని డీఆర్‌డీఏ కార్యాలయం

భారీ పరిశ్రమ: డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీ

చిన్న/మధ్యతరహా పరిశ్రమ: ఎంఎస్‌ఆర్ లెదర్ పరిశ్రమ

స్వచ్ఛ వసతిగృహాలు: సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం, బీసీ బాలురు వసతిగృహం (ఆనందపురం), గిరిజన సంక్షేమ శాఖ పీఎం కళాశాల బాలికల వసతిగృహం (విశాఖ)

రెసిడెన్సియల్ స్కూలు: కొమ్మాదిలోని సాంఘిక సంక్షేమ శాఖ రెసిడెన్సియల్ స్కూలు ఆఫ్ ఎక్సలెన్స్

స్వచ్ఛ వారియర్స్: రిట్టిపిల్లి అప్పలపైడమ్మ (జోన్-1), వేమలి అరుణకుమారి (జోన్-3), నూకాల్ల లక్ష్మి (జోన్ 4), ధనాల పైడిరాజు (జీవీఎంసీ జోన్-6),యానపు దేవుడు (జోన్-8).

గ్రీన్ అంబాసిడర్లు: సూరచిన్న (వెల్లంకి), వాదా సత్యనారాయణ (టి.నగరంపాలెం), చలపాక సూర్యనారాయణ, బందా మరిడమ్మ (పినగాడి), పారుపల్లి రాంబాబు (వేములవలస)

భక్తి శ్రద్ధలతో విజయదశమి



గెద్దపేటలో కలశాలతో మహిళల ఊరేగింపు

భీమునిపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ విజయదశమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు.మండపాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలను భక్తి, శ్రద్ధలతో నిర్వహించారు. కాగా శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు పురస్కరించుకుని గోస్తనీ సాగర సంగమంలో అమ్మవారి విగ్రహాల నిమజ్జనాలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండపాల్లో ఏర్పాటు చేసిన ప్రతిమలను శనివారం సంగమంలో నిమజ్జనం చేయనున్నారు. ఈ మేరకు అధికారులు బారికేడ్లు, ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయడంతో పాటు గజ ఈతగాళ్లను సిద్ధం చేస్తున్నారు.

కొమ్మాది : చంద్రంపాలెం జాతర గుట్ట దుర్గాలమ్మ ఆలయంలో తొమ్మిది రోజుల పాటు జరిగిన శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారంతో ముగిసాయి. చివరి రోజు అమ్మవారి పల్లకీ సేవ జరిపారు. అనంతరం మహాన్నదానం నిర్వహించారు.ప్రముఖ క్రికెటర్ వేణుగోపాల్, హేమలత దంపతుల ఆర్థిక సహాయంతో లడ్డూ ప్రసాదం అమ్మవారికి నివేదించి, తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి పూజలు చేసిన కుంకుమ, పసుపు కొమ్ములు, గాజులను భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, కమిటీ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, కార్యదర్శి నాగోతి తాతారావు, పిళ్లా కృష్ణమూర్తిపాత్రుడు పాల్గొన్నారు.

ఎండాడ : జీవీఎంసీ 8వ వార్డు పరిధిలో జరిగిన శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిసాయి. ఎండాడ దుర్గాదేవి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గీతం జిమ్‌సర్ ఆవరణలో ఉన్న రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు శాకంబరి అలంకరణలో దర్శనమిచ్చారు.

ఆనందపురం : గంభీరం పంచాయతీ ఐఐఎం రోడ్డులో ఉన్న హరే కృష్ణ మూవ్మెంట్ ఆధ్వర్యంలో విజయదశమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా 25 అడుగుల రావణాసురుడు నమూనా ఏర్పాటు చేసి, బాణసంచాతో దహనం చేశారు.

పద్మనాభం : మండలంలోని పలు గ్రామాల్లో దసరా ఘనంగా జరిగింది. పద్మనాభం, రెడ్డిపల్లి, పొట్నూరు, మద్ది, గెద్దపేట గ్రామాల్లో అమ్మవారిని రాజరాజేశ్వరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మద్దిలో దేవీ మండపం, సాగర దుర్గ ఆలయం, గెద్దపేట సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సహిత లక్ష్మీగణపతి ఆలయాల్లో దుర్గా హోమం నిర్వహించారు. కలశాలతో 108 మంది మహిళలు ఊరేగింపు చేశారు.



గాంధీజీ విగ్రహం నివాళి అర్పిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, తదితరులు

కలెక్టరేట్‌లో గాంధీజీ, శాస్త్రి జయంతి

మహారాణిపేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ గాంధీజీ చూపిన బాటలో నడవాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ కోరారు. ఆయన కలెక్టరేట్ ఆవరణలో ఉన్న గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు, అనంత రం మాట్లాడుతూ గాంధీజీ జీవితం చరిత్రలో ఎప్పటికీ చిరస్మరణీయంగా ఉంటుందని చెప్పారు. అలాగే లాల్ బహ దూర్ శాస్త్రి జయంతి కూడా కావడంతో ఆయన చిత్రపటా నికి పూలమాల వేసి, నివాళి అర్పించారు.



సాగర్‌నగర్ సీవరేజ్ పంపుహౌస్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

బీచ్‌లో వ్యర్థాలు కలవకుండా చర్యలు

- జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

సాగర్‌నగర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : కాలువల్లోని వ్యర్థాలు బీచ్‌లో కలవకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన 8వ వార్డులోని సాగర్‌నగర్ సీవరేజ్ పంపుహౌస్ ప్లాంట్‌ను ప్రధాన ఇంజనీరు సత్యనారాయణరాజుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిచోట కాలువలోని వ్యర్థాలు నేరుగా బీచ్‌లో కలుస్తున్నాయని, కాలువలకు స్క్రీనింగ్ ఎందుకు ఏర్పాటు చేయలేదని ఆరా తీసి, ఇంజనీరింగ్ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. సాగర్‌నగర్ సీవరేజ్ పంపుహౌస్‌ను ఆనుకుని వెళుతున్న ప్రధాన కాలువలో మురుగునీరు పంప్‌హౌస్‌లోకి రాకుండా నేరుగా కాలువలోని వ్యర్థాలతో కలిసి బీచ్‌లో కలుస్తుండడం గమనించి సహాయక ఇంజనీరు శ్రీనివాసరావుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగర్‌నగర్ ప్రధాన కాలువ వద్ద వెంటనే స్క్రీన్లు ఏర్పాటు చేయాలని వాటర్ సప్లై ప్రాజెక్టు పర్యవేక్షక ఇంజనీర్ పల్లమరాజును ఆదేశించారు. అలాగే బీచ్‌లో కలుస్తున్న 24 కాలువలను ఇంజనీరింగ్ అధికారులు వెంటనే పరిశీలించాలని, అన్ని కాలువలను అప్పుఘర్ ఎస్టీపీకి అనుసంధానం చేసేందుకు ప్రణాళికలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షక ఇంజనీర్ పల్లమరాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేశ్‌కుమార్, ఏఎంఓహెచ్ డాక్టర్ రవికుమార్, కార్యనిర్వాహక ఇంజనీర్లు ఏడుకొండలు, సుధాకర్, సహాయక ఇంజనీరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాలపై పోలీస్ పంచాయితీ

... 5వ పేజీ తరువాయి

ఆశీస్సులతో అనధికారికంగా చికెన్ వ్యర్థాల సేకరణ మొదలెట్టారు. అతని వాహనాలను జీవీఎంసీ నుంచి టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు పట్టుకుని అధికారులకు అప్పగించడం మొదలుపెట్టారు. అందుకు ప్రతిగా సదరు వైసీపీ చోటా నేత కూడా చికెన్ వ్యర్థాలను చేపల చెరువులకు తరలిస్తున్న కాంట్రాక్టర్ల వాహనాలను పట్టుకుని పోలీసులకు, జీవీఎంసీ అధికారులకు అప్పగించారు. దీనిపై కౌన్సిల్ సమావేశంలో చర్చ జరగడంతో ఈ వ్యవహారానికి బాధ్యుడైన చీఫ్ వెటర్నరీ అధికారి డాక్టర్ కిషోర్‌ను జీవీఎంసీ నుంచి సరండర్ చేశారు. ఇదిలావుండగా సదరు వైసీపీ చోటా నేత ఇటీవల తమను పిలిచి వాటా కావాలని, ఇవ్వకపోతే ఇబ్బందులు పడాల్సి ఉంటుందని, వాహనాలను తిరగనివ్వనని బెదిరించారంటూ కాంట్రాక్టర్లంతా నగరంలోని ఒక ప్రజా ప్రతినిధిని కలిసి ఫిర్యాదు చేశారు. వైసీపీకి చెందిన నేత బెదిరింపులకు దిగడం, అధికారులు అతనికి వత్తాసు పలకడం ఏమిటని ఆగ్రహం వ్యక్తంచేసిన సదరు ప్రజా ప్రతినిధి నేరుగా నగర పోలీస్ కమిషనర్‌కు ఫోన్ చేసి విషయాన్ని వివరించినట్టు తెలిసింది. కాంట్రాక్టర్లు కూడా సీపీని కలిసి తమ ఇబ్బందులను వివరించడంతో దీనిపై విచారణ జరిపి భవిష్యత్తులో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని టాస్క్‌ఫోర్స్ పోలీసులను ఆయన ఆదేశించారు. సీపీ ఆదేశాలతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు సదరు వైసీపీ చోటా నేతను రెండు రోజుల కిందట స్టేషన్‌కు పిలిచారు. వాహనాలను అడ్డుకున్నా, బెదిరింపులకు దిగినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఆ సమయంలో కూటమికి చెందిన నేత ఒకరు...టాస్క్‌ఫోర్స్ పోలీసులకు ఫోన్ చేసి వైసీపీ చోటా నేతను తక్షణం విడిచిపెట్టాలని కోరారు. ఈ సందర్భంగా పోలీసులకు, కూటమి నేతకు మధ్య గట్టిగా వాదన జరిగినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు సీపీ దృష్టికి తీసుకువెళ్లినట్టు చెబుతున్నారు.

పెనుగాలుల బీభత్సం

... 5వ పేజీ తరువాయి

ఒరిగిపోయాయి. జీవీఎంసీ కార్యాలయం సమీపానున్న ఒక షాపింగ్ కాంప్లెక్స్‌లో పెద్ద హోర్డింగ్ ఏర్పాటుచేయగా గాలులకు అది గోడతో సహా కూలిపోయింది. పలుచోట్ల చెట్లు పడి కార్లు, ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. చెట్లు, కొమ్మలు విరిగి అడ్డంగా పడడంతో వర్షం తెరిపిచ్చిన తరువాత రోడ్లపైకి వచ్చిన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జీవీఎంసీ అధికారులు యుద్ధ ప్రాతిపదికన రంగంలో దిగి విరిగిన చెట్లను, కొమ్మలను పక్కకు తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు. ప్రజారోగ్యం, ఉద్యానవన, మెకానికల్ సిబ్బంది అంతా ఇవే పనుల్లో నిమగ్నమయ్యారు. కమిషనర్ కేతన్ గార్గ్ దగ్గరుండి పనులు పర్యవేక్షించారు. ఇందుకోసం ఎనిమిది ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. చెట్ల తొలగింపునకు 17 జేసీబీలను తీసుకువచ్చారు. శుక్రవారం సాయంత్రానికి 145 చెట్లు తొలగించారు. మిగిలిన చెట్ల తొలగింపు పనులు కొనసాగుతున్నాయి. జీవీఎంసీ పరిధిలో తొమ్మిది విద్యుత్ స్తంభాలు నేలకొరిగినట్టు గుర్తించి, వాటిని కూడా పునరుద్ధరించే చర్యలు చేపట్టారు.

గూగుల్ డేటా సెంటర్‌కు మోకాలడ్డు!

... 5వ పేజీ తరువాయి

క్షేత్రస్థాయిలో పర్యటించి ఎంజాయ్‌మెంట్ సర్వే చేసి ప్రతి రైతు నుంచి సమాచారం సేకరించారు. గ్రామంలో ప్రభుత్వానికి చెందిన 308 ఎకరాలు, ప్రైవేటు భూమి మరో ఎనిమిది ఎకరాలు సేకరించేందుకు అన్ని రకాల సర్వేలు పూర్తిచేసి అనంతరం గ్రామ సభ పెట్టారు. ప్రతి రైతు పేరు చదివి అతనికి చెందిన భూ విస్తీర్ణం వివరాలు వెల్లడించారు. ప్రభుత్వ భూమిలో సుమారు 120 మంది రైతులు ఉన్నట్టు గుర్తించారు. భూసేకరణ కోసం జీవో 571 ప్రకారం రైతులకు పరిహారం ఇవ్వనున్నారు. పట్టా రైతులకు బేసిక్ విలువపై రెండున్నర రెట్లు అందజేసే అవకాశం ఉంది. అయితే గత ప్రభుత్వంలో రైతులకు అడ్వాన్స్‌లు ఇచ్చిన బ్రోకర్లు ఇటీవల గ్రామానికి వచ్చి తమకు ఇస్తామన్న భూముల సంగతి ఏమిటని ప్రశ్నించడంతోపాటు వారిని రెచ్చగొట్టేందుకు యత్నించారని తెలిసింది. ప్రభుత్వం ఇచ్చే పరిహారం కంటే ఎక్కువ ఇస్తామని కొంతమంది రైతులను రెచ్చగొట్టడంతో వారంతా కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. భూసేకరణ కోసం తమకు నోటీసులు ఇవ్వలేదని ఇతరత్రా అంశాలపై నిబంధనలు పాటించలేదని పేర్కొంటూ కోర్టుకు వెళ్లడంతో రెవెన్యూ యంత్రాంగం పూర్తి వివరాలు సమర్పించింది. దీంతో రిట్ పిటిషన్‌ను కోర్టు డిస్పోజ్ చేసింది. దీంతో కంగుతిన్న బ్రోకర్లు...మరికొంతమంది రైతులను రెచ్చగొట్టి కోర్టుకు వెళ్లేందుకు పురిగొల్పే ప్రయత్నం చేస్తున్నారని గ్రామంలో ప్రచారం సాగుతుంది. ఇదిలావుండగా పరిహారం విషయమై స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పలుమార్లు అధికారులతో సమావేశాలు నిర్వహించడంతో పాటు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లడంతో సానుకూల ప్రకటన వచ్చింది. రైతులకు అన్నివిధాలా న్యాయం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న తరుణంలో భూసేకరణకు మోకాలడ్డడంపై పూర్తిస్థాయి విచారణ చేయనున్నట్టు తెలిసింది.

ఈదురు గాలులు.. నేల కొరిగిన చెట్లు

» రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టిన అధికార యంత్రాంగం » విద్యుత్ సరఫరాకు అంతరాయం » జనజీవనానికి ఆటంకం


మద్దిలపాలెం : పిఠాపురంకాలనీలో కార్ల మీద పడిన చెట్లు


ఎంవీపీ రైతుబజార్ విరిగిన చెట్లు కొమ్మలు


ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరులోని ఓ వీధిలో ఇంటిపై పడిన చెట్టుకొమ్మ


ఎంవీపీ కాలనీ రెండో సెక్టరులో వేర్లతో సహా నేలకొరిగిన వృక్షం

మద్దిలపాలెం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మద్దిలపాలెంలో గురువారం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. ఉదయం నుంచి వీచిన గాలులకు పలు చోట్ల భారీ, అతి భారీ చెట్లు నేలకొరిగాయి. ఎక్కడికక్కడే కేబుల్ వైర్లపై చెట్టు కొమ్మలు విరిగిపడి ధ్వంసం అయ్యాయి. ముఖ్యంగా పిఠాపురంకాలనీలో భారీ వృక్షాలు కూలలిపోయాయి. వేర్లు సహా ఊడిపోయాయి. అక్కడే కింద పార్కింగ్ చేసిన కార్లపై పడడంతో కార్లు స్వల్పంగా దెబ్బతిన్నాయి. మంగాపురంకాలనీలో భారీ చెట్టు ఎదురుగా ఉన్న భవనంపై పడింది. చెట్టుతో పాటు విద్యుత్ స్థంభం కూడా పడిపోయింది. దీంతో విద్యుత్ లైన్‌ను వెంటనే కట్ చేశారు. అంతేకాకుండా శివాజీపాలెం, పీతలవానిపాలెంలో చెట్టు కొమ్మలు విరిగి రోడ్డులకు అడ్డంగా పడిపోయాయి. ఉదయం చెట్లు కూలిపోగా జీవీఎంసీ సిబ్బంది సాయంత్రం నుంచి కొమ్మలు తొలిగించే చర్యలు చేపట్టారు. అప్పటి వరకు వాహన రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. మద్దిలపాలెం, చైతన్యనగర్ ఏరియాల్లో చెట్టు కొమ్మలు విరిగి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో..

ఈదురుగాలులకు మద్దిలపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పెద్ద సంఖ్యలో చెట్టు నేలకొరిగాయి. మద్దిలపాలెం వైపు కాంప్లెక్స్ ప్రహరీకి ఆనుకుని పదుల సంఖ్యలో చెట్టు ఉన్నాయి. ఈదురు గాలులకు దాదాపు చెట్లు మొత్తం పడిపోయాయి. మద్దిలపాలెం నుంచి రాజమండ్రి, విజయవాడ నగరాలకు బస్సులు వెళ్తాయి. సిటీ బస్సులు కూడా వందల్లో ఇక్కడ నుంచి బయలుదేరుతాయి. దీంతో బస్సులకు ఆటంకం కలగకుండా ఆర్టీసీ అధికారులు వెంటనే చెట్టు తొలగింపునకు చర్యలు చేపట్టారు. కాంప్లెక్స్ ప్రహరీకి ఆనుకుని ఉన్న భారీ చెట్టు గోడతో సహా కూలిపోయింది. అధికారులు వెంటనే తొలగింపు చర్యలు చేపట్టడంతో ప్రయాణికులకు ఇబ్బందులు కలుగలేదు.

ఎంవీపీ కాలనీలో..

ఎంవీపీ కాలనీ : ఈ ప్రాంతంలో గురువారం ఉదయం ఆకస్మికంగా వీచిన గాలులకు పలు ప్రాంతాల్లోని చెట్లు నేలకొరిగాయి. కొన్ని చోట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. దీనివల్ల వాహనాల రాకపోకలు, పాదచారులకు ఇబ్బంది ఎదురైంది. విజయదశమి రోజున ఉదయం నుంచి ముసురు నెలకొనడంతో వ్యాపారాలు సాగలేదు. దీనికి తోడు ఒక్కసారిగా వీచిన గాలులలకు రవాణా వ్యవస్థ స్తంభించింది. కొన్ని చోట్ల మార్గాలు మూసుకుపోయి, ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాల్సి వచ్చింది. రహదారుల పక్కన వ్యాపారాలు చేసుకుంటున్న వారు ఇబ్బందులకు గురయ్యారు. గాలుల తర్వాత కూడా రహదారులు ఖాళీగానే దర్శనమిచ్చాయి. వర్షం హెచ్చరికల కారణంగా అధికార యంత్రాంగం సన్నద్ధంగా ఉండడంతో, యుద్ధప్రాతిపదికన జీవీఎంసీ సిబ్బంది ఎక్కడికక్కడ చెట్లు, కొమ్మలను తొలగించి, రహదారులపై రాకపోకలకు మార్గం సుగమం చేశారు.

నేలకొరిగిన చెట్ల కొమ్మలు

వెంకోజీపాలెం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలో గురువారం వీచిన ఈదురు గాలులకు రోడ్డు పక్కనున్న చిన్న చిన్న చెట్లు, పెద్ద వృక్షాల చెట్టు కొమ్మలు నేలకొరిగాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దసరా సందర్భంగా జీవీఎంసీ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో పోలీసు సిబ్బంది స్థానిక యువకులతో రోడ్డుకు అడ్డంగా పడిన కొమ్మలను తొలగింపజేశారు. శుక్రవారం ఉదయం రోడ్డుపై పడి ఉన్న కొమ్మలు, చెట్ల కమ్మలను పారిశుధ్య సిబ్బంది తొలగించారు. జీవీఎంసీ 15, 16 వార్డులకు చెందిన శానిటరీ సిబ్బంది రోడ్డుపై పేరుకుపోయిన చెత్త, మురికిని శుభ్రం చేశారు.

స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలి

» కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ
» బీచ్ రోడ్డులో ప్రారంభమైన ఖాదీ సంత


ఖాదీ సంతను ప్రారంభించిన అనంతరం ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ

బీచ్ రోడ్డు, అక్టోబరు 3, (ఆంధ్రజ్యోతి): దేశ పురోగతికి స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డు విశ్వప్రియ ఫంక్షన్ హాల్ ఎదురుగా ఏర్పాటు చేసిన ఖాదీ సంతను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడుతూ ఖాదీ ఉద్యమ స్ఫూర్తిని చాటేలా అన్ని జిల్లాల్లో 90 రోజులపాటు ఖాదీ సంతలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. స్వదేశీ ఉత్పత్తుల కొనుగోలుతో అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ప్రధానమంత్రి మోదీ స్వదేశీ నినాదం తీసుకొచ్చారన్నారు. అమెరికా టారిఫ్‌లతో అందరిపైనా ప్రభావం పడుతుందని, దిగుమతులపై ఆధారపడడం తప్పనిసరి కాదన్నారు. స్వదేశీ వస్తువుల తయారీ, వినియోగం పెరగాలని, ఏటికొప్పాక, కొండపల్లి కళలను, చేనేత పరిశ్రమను ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. భారత ఆర్థిక వ్యవస్థ 2038 నాటికి ప్రపంచంలో రెండో స్థానానికి, 2047 నాటికి అగ్రస్థానానికి చేరుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగులకు ఉపాధి కల్పించి స్వయంసమృద్ధి దిశగా నడిపించేందుకు గాంధీ ఖాదీ భావనను అభివృద్ధి చేశారన్నారు. ప్రధానమంత్రి మోదీ దేశంకోసం ఖాదీ, ఫ్యాషన్ కోసం ఖాళీ అనే మంత్రాన్ని తీసుకొచ్చారని వెల్లడించారు. అనంతరం గాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఖాదీ సంతలో స్టాళ్లను సందర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కోశాధికారి ఎం.నాగేంద్ర, అధికార ప్రతినిధి సుహాసిని, జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, తదితరులు పాల్గొన్నారు.

అరకు కాఫీకి జాతీయ అవార్డు

» సీఎం చంద్రబాబును కలిసిన గిరిజన సహకార సంస్థ వైస్ చైర్మన్ కల్పనకుమారి


ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి అవార్డును చూపుతున్న గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, గిరిజన సహకార సంస్థ వైస్ చైర్మన్ కల్పనాకుమారి

విశాఖపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గిరిజన సహకార సంస్థకు చెందిన అరకు వ్యాలీ కాఫీకి ఫైనాన్సియల్ ట్రాన్స్ఫర్మేషన్ విభాగంలో చేంజ్ మేకర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు-2025 లభించింది. ఈ అవార్డును గత నెల 26న ముంబాయిలో జరిగినబిజినెస్ లైన్ చేంజ్ మేకర్ అవార్డు కార్యక్రమంలో కేంద్ర పెట్రోలియం, సహజ వాయు శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పూరి చేతుల మీదుగా గిరిజన సహకార సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కల్పనకుమారి అందుకున్నారు. ఈ క్రమంలో అవార్డు, ప్రశంస పత్రాన్ని శుక్రవారం అమరావతిలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణితో కలిసి కల్పనకుమారి సీఎం చంద్రబాబునాయుడును కలిశారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఈ సందర్భంగ గిరిజన సహకార సంస్థ ఎండీ కల్పనకుమారి మాట్లాడుతూ అరకు కాఫీకు అవార్డు దక్కడం గొప్ప విషయమని, ఈ అవార్డు గిరిజన రైతులు, జీసీసీ సిబ్బందికి అంకితమని పేర్కొన్నారు. అరకు కాఫీ ఒక బ్రాండ్ మాత్రమే కాదని, ఇది గిరిజనుల గౌరవానికి, భారతదేశ గర్వానికి ప్రతీక అని పేర్కొన్నారు.

జిల్లా కోర్టుల ప్రభుత్వ న్యాయవాదిగా సత్యనారాయణ



విశాఖపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టుల ప్రభుత్వ న్యాయవాదిగా సీనియర్ న్యాయవాది బి.సత్యనారాయణను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ లీగల్ అండ్ లెజిస్లేటివ్ కార్యదర్శి గొట్టాపు ప్రభావతి ఆదేశాలు జారీచేశారు. మూడు ఏళ్ల పాటు నాయవాది సత్యనారాయణ ఈ పదవిలో ఉంటారని పేర్కొన్నారు. జిల్లా కోర్టులకు సంబంధించి సివిల్ కేసులు ప్రభుత్వం తరుపున వాదిస్తారని పేర్కొన్నారు. విశాఖ జిల్లాలో సీనియర్ న్యాయవాదిగా ఉన్న బి.సత్యనారాయణను ప్రభుత్వ న్యాయవాదిగా నియమించడం పట్ల బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, కమిటీ సభ్యులు సత్యనారాయణను అభినందించారు.

కారాగారాలు.. ఖైదీల పరివర్తన కేంద్రాలు

» జిల్లా కలెక్టర్ హరింధర్ ప్రసాద్ » కేంద్ర కారాగారంలో గాంధీజీ జయంతి



ఆరిలోవ : కేంద్ర కారాగారంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి చెన్నంశెట్టి రాజు, వేదికపై జిల్లా కలెక్టర్ హరింధర్ ప్రసాద్, అధికారులు

ఆరిలోవ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఖైదీల్లో పరివర్తన తీసుకొచ్చేందుకు ఏర్పాటు చేసిన పరివర్తన శాలలే కేంద్ర కారాగారాలు అని జిల్లా కలెక్టర్ హరింధిర ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం గాంధీ జయంతి సందర్భంగా కేంద్ర కారాగారంలో ఏర్పాటు చేసిన కార్యక్రమలో పాల్గొన్న ఆయన, జిల్లా ప్రధాన న్యాయమూర్తి చెన్నంశెట్టి రాజుతో కలిసి మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ క్షణికావేశానికి గురైచేసిన తప్పును సరిదిద్దడానికి ఖైదీలకు సత్ప్రవర్తన అలవరచడమే కేంద్ర కారాగారాల లక్ష్యమన్నారు. జిల్లా కలెక్టర్ హరీంధిర ప్రసాద్ మాట్లాడుతూ.. ఖైదీల్లో మానసిక పరివర్తనకు కారాగారంలో అవకాశం లభిస్తుందన్నారు. ఇది గాంధీ సూచించిన మార్గమన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి చెన్నంశెట్టి రాజు పుట్టుకతో ఎవరూ నేరస్థులు కారని, అందుకే తప్పు చేసిన వారిలో మానసిక పరివర్తన కల్పించాలన్నదే గాంధీ సిద్ధాంతమని అన్నారు. ఇందులో అహింసా సిద్ధాంతం ఇమిడి ఉందన్నారు.కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు , జైలు పర్యవేక్షణాధికారి మహేష్ బాబు, ఉప పర్యవేక్షాణిధికారి సాయిప్రవీణ్, జైలు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహనీయుల ఆశయాల సాధనకు కృషి చేయాలి

- వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్

సిరిపురం, అక్టోబరు 3 (ఆంధ్ర జ్యోతి) : దేశాభివృద్ధికి అహర్నిశలూ పాటుపడి ప్రాణాలు అర్పించిన మహనీయుల ఆశయాల సాధనకు కృషి చేయాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ పేర్కొన్నారు. వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో గురువారం మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆ మహనీయుల చిత్రపటాలకు కమిషనర్ విశ్వనాథన్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అహింసా మార్గంలో పోరాటాలు చేసి, దేశానికి స్వాతంత్ర్యాన్ని తీసుకొచ్చిన మహాత్మా గాంధీ ప్రతీ ఒక్కరికీ ఆదర్శం కావాలన్నారు. విభిన్న సంస్కృతుల సమ్మేళనంతో భారత దేశం ఐక్యతతో ముందుకు సాగుతుందంటే, అది గాంధీ చూపిన మార్గమేనన్నారు. ఆ మహనీయుని చూపిన మార్గంలో ప్రతీ ఒక్కరూ పయనించాలన్నారు.జై కిషాన్ నినాదంతో హరిత విప్లవానికి శ్రీకారం చుట్టిన మహోన్నతమైన వ్యక్తి లాల్ బహదూర్ శాస్త్రి అని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రమేష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంవీపీ రైతు బజార్‌కు స్వచ్ఛ అవార్డు



ఎంవీపీ రైతుబజార్ ప్రధాన ద్వారం

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛ అవార్డుల్లో విశాఖపట్నంలోని ఎంవీపీ కాలనీ రైతు బజార్ స్థానం సంపాదించింది. మోడల్ రైతు బజార్‌గా పేరొందిన ఈ బజార్‌కు కొనుగోలుదారుల ఆదరణ కూడా ఎక్కువే. నగరంలోని మిగిలిన బజార్లలో కంటే ఈ రైతుబజార్‌లో సౌకర్యాలు మెరుగ్గా ఉంటాయి. అలాగే పరిశుభ్రత, నిర్వహణ వంటి అంశాల్లో కూడా ఇతర రైతు బజార్ల కన్నా బాగుంటుందన్న పేరుంది. ఇటీవల మరింత ఆకర్షణీయంగా తయారు చేయడంలో అధికారుల కృషి కూడా ఉంది. ఏయూ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులతో రైతు బజార్‌లోని చెట్లకు చక్కని రంగులతో చిత్రాలను వేయించారు. దీంతో పరిసరాలు మరింత అందంగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ రైతు బజార్‌కు స్వచ్ఛ అవార్డు లభించడం విశేషం. ఈ నెల 6న అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ఈ అవార్డు ప్రదానం చేస్తారు. కాగా అవార్డు రావడం పట్ల చాలా ఆనందంగా ఉందని రైతు బజారు ఎస్టేట్ అధికారి వరహాలు పేర్కొన్నారు. బజార్‌లో వ్యాపారం చేసే రైతులు కూడా అవార్డు పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

105 మద్యం బాటిళ్ల స్వాధీనం : నిందితుడి అరెస్టు

పెందుర్తి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఓ ఇంటిలో మద్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అతని దగ్గర నుంచి 105 మద్యం బాటిళ్లు స్వాధీనంచేసుకున్నారు. సీఐ కేవీ సతీశ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గవరజగ్గయ్యపాలెంలో బింగినేడి శ్రీను అనే వ్యక్తి ఇంటిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో అతని వద్ద నుంచి 105 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు.

సినిమా గైడ్

● **కాంతార-2** : మెలోడి, శరత్, శ్రీరామా, శ్రీకన్య, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2(104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
● **ఓజీ** : శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, , లీలామహల్, కిన్నెర, కామేశ్వరి, వెంకటేశ్వర-1,2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
● **మిరాయి**: లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1(పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
● **ఘాటీ** : ముక్తాస్, (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 23, వంకాయలు (తెలుపు) 48, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 20, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 36, బీరకాయలు 32, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 54, దొండకాయలు 42, బంగాళ దుంపలు19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది) 72, బరబాటి 38, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 66, కీరదోస 32, కాప్సికమ్ 68, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 32, చిలగడదుంపలు 32, కంద 40, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 80, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	510
విజయనగరం	514
శ్రీకాకుళం	514

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	120
లైవ్ ధర	140
విత్ స్కిన్	250
స్కిన్‌లెస్	260

బోటు బోల్తాపడి మత్స్యకారుడి మృతి


నూకరాజు (ఫైల్ ఫొటో)

విశాలాక్షినగర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): వేట సాగించి తీరానికి చేరుకునే సమయంలో బోటు బోల్తాపడడంతో మత్స్యకారుడు మృతి చెందాడు. ఆరిలోవ ఎస్‌ఐ శంకర్ తెలిపిన వివరాల మేరకు.. జోడుగుళ్లపాలేనికి చెందిన మత్స్యకారులు శుక్రవారం వేకువజామున మూడు గంటలకు చేపట వేటకు బోటులో సముద్రంలోకి వెళ్లారు. తిరిగి 10.30 గంటలకు తీరానికి చేరుకునే క్రమంలో అలలు ఉధృతమవడంతో బోటు బోల్తా పడింది. ఈ ఘటనలో గరికిన నూకరాజు (36) బోటు కింద చిక్కుకుని తిరిగి సముద్రంలోకి కొట్టుకుపోయాడు. దీంతో సహచరులు బోటులో సముద్రంలోకి వెళ్లి గాలించగా ఆచూకీ లభించింది. అతడ్ని తీరానికి చేర్చి చూడగా అప్పటికే మృతిచెందాడు. మృతుడికి భార్య పూర్ణ, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. ఈ ఘటనలో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించి, మృతుడి తండ్రి గురుమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో రావణ దహనం


కార్యక్రమంలో పాల్గొన్న సీపీ శంఖబ్రత బాగ్చీ, బహ్మకుమారీ రామేశ్వరి, ప్రతినిధులు

సిరిపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో దసరా పర్వదినం పురస్కరించుకొని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద రావణ దహనం వేడుక నిర్వహించారు. కార్యక్రమానికి నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గాంధీ జయంతి సందరంగా ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వేడుకలను ఉద్దేశించి మాట్లాడుతూ విజయదశమి అంటే చెడుపై మంచి సాధించిన గొప్ప విజయమన్నారు. ఇలాంటి వేడుకల్లో పాల్గొడటం ఆనందంగా ఉందన్నారు. బ్రహ్మకుమారీ బీకే రామేశ్వరి మాట్లాడుతూ విజయదశమి రోజున జమ్మి చెట్టును ఆరాధిస్తే గొప్ప విజయాలు సిద్ధిస్తాయాని పురాణ, ఇతిహాసాలు చెబుతున్నాయన్నారు. చెడుపై సాధించిన విజయానికి సూచికగా రావణ దాహనం కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు.

అనుభూతితో ఉత్తమ రచనలు

» పద్మభూషణ్ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్



'అండమాన్ చూద్దాం రండి ' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, రచితలు నారంశెట్టి ఉమామహేశ్వరరావు, సెంట్రల్ ఎక్సైజ్ అధికారి నల్లా అపర్ణ తదితరులు

విశాఖపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : రచనలకు అనుభవం కంటే అనుభూతి గొప్పదని, యాత్రా కథన రచనలు వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని పద్మభూషణ్ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ పేర్కొన్నారు. ప్రజ్ఞశ్రీ డాక్టర్ బండి సత్యనారాయణ రాసిన 'అండమాన్ చూద్దాం రండి ' (యాత్ర కథనం) పుస్తకాన్ని ఆయన ఏయూ హిందీ విభాగంలో శుక్రవారం ఉదయం ఆవిష్కరించారు. అనంతరం లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ కవి అయిన బండి సత్యనారాయణ యాత్రా కథనం రాయడం విశేషమన్నారు.ఈ సందర్భంగా ఆయన 1996లో పోర్టుబ్లెయిర్ వెళ్లిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. యాత్రా కథన రచనలు వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయన్న ఆయన కొన్నింటిని వివరించారు. తాను పాకిస్థాన్‌పై రాసిన యాత్రా రచనను సభ ముందుంచారు. అండమాన్‌కు వెళ్లేందుకు గతంలో మాదిరిగా భయపడాల్సిన అవసరం లేద న్న ఆయన.. ఇప్పుడు ఆ ప్రాంతం మంచి సందర్శన స్థలంగా మారిందన్నారు. రచనల్లో ఉన్న దోషాలను ఉదహరించిన ఆయన.. పుస్తకం ముద్రించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మంచి పుస్తకం అందించిన బండి సత్యనారాయణను ఆయన అభినందించారు. కేంద్ర సాహిత్య అకాడమీ బాల పురస్కార గ్రహీత నారంశెట్టి ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ పుస్తకం నోరు తెరవని ఉపన్యాసకుడని, పుస్తకాలు నేస్తాలని అభివర్ణించారు. ఈ పుస్తకం చదివిన తరువాత అండమాన్ వెళ్లాలన్న ఆరాటం కలుగుతోందన్నారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన సెంట్రల్ ఎక్సైజ్ అధికారి నల్లా అపర్ణ మాట్లా డుతూ తన భర్త సుబ్బారావు అండమాన్ లో పని చేస్తున్నారని, ఇటువంటి సమ యంలో సత్యనారాయణ పుస్తకం రాయడం ఆనందదాయకమన్నారు. దూరదర్శన్ అండ్ ఆకాశవాణి డిప్యూటీ డైరక్టర్ జనరల్ సి.సుబ్బారావు తొలి ప్రతిని స్వీకరించారు. సభలో పుస్తక రచయిత డాక్టర్ బండి సత్యనారాయణ, మేడా మస్తాన్ రెడ్డి, మార్టూరు శ్రీనివాసరావు, ఉప్పల అప్పలరాజు, డాక్టర్ కేవీఎస్ హనుమంతురావు, సీహెచ్ చిన సూర్యనారాయణ, మరడాన సుబ్బారావు, స్వర్ణ శైలజ, పీఎల్‌వీ ప్రసాద్, శీరేల సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

యువకుడిని కాపాడిన లైఫ్ గార్డ్స్



బీచ్ రోడ్డు, అక్టోబరు 3, (ఆంధ్రజ్యోతి): సముద్ర స్నానానికి దిగిన ఓ యువకుడు కెరటాల ఉధృతికి కొట్టుకుపోతుండగా లైఫ్‌గార్డ్స్ రక్షించారు. మహారాష్ట్రకు చెందిన నాగపూర్ అన్స్ రాథోడ్ (20) నాగపూర్‌లో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. స్నేహితులతో కలిసి అనకాపల్లిలో జరుగుతున్న శివ గర్జన కార్యక్రమానికి వచ్చాడు. కార్యక్రమం అనంతరం ఆర్కే బీచ్‌కు వచ్చి సముద్రంలో స్నానానికి దిగాడు. అయితే అలల ఉధృతి ఎక్కువవడంతో గల్లంతయ్యాడు. గమనించిన మెరైన్ పోలీసులు, జీవీఎంసీ లైఫ్ గార్డులు పోలరాజు అతడిని రక్షించారు.

దసరా మామూలు ఇవ్వలేదని దాడి

మద్దిలపాలెం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : దసరా మామూలు ఇవ్వలేదని హోటల్ నిర్వాహకుడిపై దాడి చేసిన ముగ్గురు వ్యక్తులపై గురువారం త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలలా ఉన్నాయి.

జీవీఎంసీ ప్రధాన గేటు ఎదురుగా ఎ.నరేంద్ర, మణికంఠ ఇద్దరు చిట్టినాయుడు కోడి పులావ్ హోటల్ నిర్వహిస్తున్నాడు. కాగా ధనకోటి సురేష్, మద్దు హరి, చంద్రాల మహేష్‌తో పాటు కొందరు తీన్మార్ బృందంగా హోటల్ వద్దకు వచ్చి దసరా మామూలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇవ్వకపోతే దాడి చేస్తామని బెదిరించారు. దానికి నరేంద్ర, మణికంఠ ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించగా, చందాకు వచ్చిన వారు దాడికి దిగారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించి దాడి చేసిన సురేష్, హరి, మహేష్‌లపై కేసు నమోదు చేశారు.

కలప దుకాణంలో అగ్ని ప్రమాదం

» స్థానికుల అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం
» సకాలంలో చేరుకొని మంటలను అదుపు చేసిన అగ్ని మాపక శకటం సిబ్బంది
» సుమారు రూ.10 లక్షల ఆస్తి నష్టం?


కలప దుకాణంలో చెలరేగుతున్న మంటలు

వెంకోజీపాలెం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : అందరూ నిద్రలోకి జారుకుంటున్న సమయం.. అంతా చీకటిగా ఉండే ప్రాంతంలో ఒక ఎర్రటి వెలుగు స్థానికులకు కనిపించింది. ఏమిటా అన్న అనుమానంతో వెళ్లి చూస్తే తలుపులు, చెక్కలు దుకాణం అగ్నికి ఆహుతి అవుతోంది. వెంటనే స్థానికులు దుకాణ యజమానితో పాటు అగ్నిమాపక సిబ్బందికి కూడా సమాచారం అందించడం, వారికి సహాయం చేయడంతో ఒక్క దుకాణంతో మంటలను ఆపగలిగారు. గ్రేటర్ పరిధిలోని 15వ వార్డు పాతవెంకోజీపాలెం స్మశాన వాటిక వద్ద రోడ్డు పక్కనున్న తలుపులు, కిటికీలు, చెక్కలు దుకాణాల వద్ద శుక్రవారం అర్థరాత్రి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. సకాలంలో స్థానికులు గమనించడంతో పెను ప్రమాదం తప్పింది. ఇక్కడ ప్రక్కపక్కనే నాలుగు దుకాణాలు ఉన్నాయి. అయితే వీటిలో చివరిదైన కూఆర్ మోహన్‌కు చెందిన దుకాణం మంటలకు ఆహుతైంది. లోపలున్న చెక్కలు, తలుపులు, గ్లాసు మెటీరియల్, మెషినరీ కూడా కాగి బూడిదయ్యాయి. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది రావడంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఇక్కడి స్మశానంలో నిత్యం రాత్రి పూట గంజాయి బ్యాచ్ తిరుగుతూ, ఆకతాయి చేష్టలకు పాల్పడుతుంటారని, వాళ్లే ఈ మంటలను అంటించి ఉంటారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సూర్యాబాగ్ అగ్నిమాపక సిబ్బంది కేసు నమోదు చేసుకున్నారు. రాత్రి పూట కావడం, దుకాణాలు మూసి ఉండడంతో ఎవరికీ ఎటువంటి ప్రమాదం సంభవించలేదని, కేవలం ఆస్తి నష్టం మాత్రం జరిగిందని, సుమారుగా రూ.10 లక్షలకు పైగా ఆస్తి నష్టం ఉంటుందని అగ్ని మాపక సిబ్బంది అంచనా వేస్తున్నారు.


అక్కయ్యపాలెం : శంకువానిపలెంలో విరిగిన చెట్టు


మర్రిపాలెం : చెట్టు కూలడంతో పాడైన శ్మశానవాటిక ప్రహరీగోడ


అబిద్ నగర్‌లో రోడ్డుపై పడిన చెట్లు

గాలివాన బీభత్సం : నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

సీతంపేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని గురువారం ఏర్పడిన గాలి, వాన బీభత్సం కారణంగా ద్వారకానగర్, డైమండ్ పార్కు, సీతంపేట, సీతమ్మధార ప్రాంతాల్లో పెద్ద చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగ్‌లు నెలకొరిగాయి. భారీ వృక్షాలు మీద పడటంతో పలు చోట్ల చాలా వాహనాలు దెబ్బతిన్నాయి. ద్వారకానగర్‌లో గల ఐసీఐసీఐ బ్యాంక్ వద్ద పెద్ద చెట్టు కారుపై, ద్విచక్రవాహనాలపై పడ్డాయి. అలాగే సమీపంలో వాణిజ్య సముదాయాల వద్ద పెద్ద హోర్డింగ్ పడిపోయింది. సీతంపేట ప్రధాన రహదారి గురుద్వార్ కూడలి నుంచి సీతపేట ప్రధాన కూడలికి వెళ్లే రహదారిలో పెద్ద వృక్షం నెలకొరిగింది. అలాగే సత్యం కూడలి నుంచి బుల్లయ్య కళాశాలకు వెళ్లే రహదారిలోని డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద పెద్ద చెట్టు రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో అటుగా రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడింది. రామా టాకీస్ నుంచి శ్రీనగర్ వెళ్లే రోడ్డులో శ్మానన వాటిక వద్ద పెట్ట చెట్టు పడిపోయింది. ఈ చెట్టుకింద అయిదు ద్విచక్రవాహనాలు ఉండడంతో నుజ్జయ్యాయి. అదే రహదారిలో మరో రెండు చెట్లు నెలకొరిగాయి. ద్వారకానగర్‌లో గల మొదటి లైన్ విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ పైన ఏర్పాటు చేసి దిమ్మలు పడిపోవడంతో పాటు టీవీకే కళాశాల పక్క రోడ్డులో విద్యుత్ స్తంభాలు, చెట్లు పడిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చెట్లు, విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. జీవీఎంసీ అధికారులు, సిబ్బంది రోడ్డుపై విరిగి పడిన చెట్లను, వాటి కొమ్మలను తొలగించారు. అయితే చెట్టు కొమ్మలు రోడ్డుపైనే అడ్డంగా ఉండడంతో అటుగా ప్రయాణించే వారు ఇబ్బందులు పడ్డారు.

నేలకొరిగిన చెట్లు

అక్కయ్యపాలెం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం కురిసిన వర్షం, ఈదురు గాలులకు పలు చోట్ల చెట్లు విరిగి పడ్డాయి. ఈదురు గాలుల ధాటికి అక్కయ్యపాలెం శ్రీనివాసనగర్‌లో పార్కింగ్ చేసిన కారుపై రావి చెట్టు విరిగి పడడంతో ఓ ఇంటి గోడ కూలింది. దీంతో కారు ధ్వంసమైంది. అలాగే కైలాసపురం సాలిగ్రామపురం, అక్కయ్యపాలెం శంకువానిపాలెం, అబిద్ నగర్, జగన్నాథపురం తదితర ప్రాంతాల్లో చెట్లు విరిగి నేలకొరిగాయి. దీంతో రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం కలిగింది. ఆ సమయంలో పరిసరాల్లో ఎవరూ లేకపోవడంతో అపాయం తప్పింది. నేలకొరిగిన చెట్లను జీవీఎంసీ కార్మికులు తొలగించారు.

కూలిన విద్యుత్ స్తంభాలు

మర్రిపాలెం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా గురువారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి 54వ వార్డు మర్రిపాలెం శ్మశానవాటిక ప్రహరీగోడపై భారీ చెట్టు కూలడంతో గోడ కూలిపోయింది. కరాస ప్రాంతంలోని ప్రధాన రహదారిలో భారీ వర్షం, గాలుల దాటికి పెద్దచెట్టు పడిపోవడంతో విద్యుత్ స్తంభం కూలిపోయింది. అదే ప్రాంతంలో మరో చోట కూడా పెద్దచెట్టు విద్యుత్ తీగలపై కూలిపోయింది. ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కంచరపాలెం నుంచి తాటిచెట్లపాలెం వెళ్లే ప్రధాన రహదారి ధర్మనగర్ వద్ద రోడ్డు మధ్యలో భారీ చెట్టు కూలిపోయింది. వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఎదురైంది.

విద్యుత్ సరఫరాకు అంతరాయం..

మురళీనగర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : వాయుగుండం ప్రభావంతో విజయ దశమి నాడైన గురువారం ఏర్పడిన గాలివాన ఈ ప్రాంతంలో భీభత్సం సృష్టించింది. పండుగ ముందు రోజు అర్ధరాత్రి నుంచి మారిన వాతావరణంతో విరివిగా చెట్లు ఉండే మురళీనగర్, మాధవధార ప్రాంతాల్లో చెట్లు నేలకూలాయి. అనేక విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. చెట్లు తీగెలపై పడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మాధవధారలోని కళింగనగర్‌లో ఓ ఇంటి ముందు పార్క్ చేసి ఉంచిన కారుపై చెట్టు విరిగి పడింది. కారు అద్దాలు పగిలి పాక్షికంగా దెబ్బతింది. బిర్లా జంక్షన్ హైవే నాలుగు వరసుల సర్వీసు రోడ్డులోని ఏఎస్ఎన్ మెగా మాల్ పేరిట నిర్మాణంలో ఉన్న కట్టడం ముందు చెట్లు నేలకొరిగాయి. మురళీనగర్ కొండ చేరువలోని నివాస ప్రాంతాలు సహా బర్మా క్యాంప్ శ్రీనివాసనగర్ రోడ్లపై ఇళ్ల ఎదుట ఏపుగా పెరిగిన ఏళ్ల నాటి వృక్షాలు నేలకొరిగాయి. జీవీఎంసీ, ఈపీడీసీఎల్ విద్యుత్ విభాగాలు, వార్డు సచివాలయాల సిబ్బంది సంయుక్తంగా చెట్ల తొలగింపు పనులు చేపట్టి విదుత్ సరఫరాను పునరుద్ధరించారు. శుక్రవారం పండుగ రోజు మురళీనగర్, మాధవధార, బర్మా క్యాంప్ సహా పలు ప్రాంతాలకు మధ్యాహ్నం 3 వరకు విద్యేత్ సరఫరా లేదు. ఉదయం జోరు గాలులతో ఆగిన సరఫరాను సిబ్బంది తిరిగి పునరుద్ధరించారు.

జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 4 వినతులు


వినతులు స్వీకరిస్తున్న సీసీపీ ధనుంజయరెడ్డి

వెంకోజీపాలెం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 4 వినతులు అందినట్టు జీవీఎంసీ సిటీ ప్లానర్ కె.ధనుంజయరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సీపీలు, డీసీపీలు, ఏపీసీలతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిటీ ప్లానర్ మాట్లాడుతూ స్వీకరించిన వినతులు/ఫిర్యాదులను నిర్ణీత సమయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు.

గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రికి నివాళులు


మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రికి నివాళులు అర్పిస్తున్న ఈపీడీసీఎల్ చీఫ్ జీఎం అశోక్‌కుమార్, జనరల్ మేనేజర్లు వీఎస్వీ రమణమూర్తి, అధికారులు

సీతమ్మధార, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో గురువారం మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీతమ్మధారలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయం ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటానికి కార్పొరేట్ కార్యాలయం ఉద్యోగులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఈపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ బి.అశోక్‌కుమార్, జనరల్ మేనేజర్లు వీఎస్వీ రమణమూర్తి, వీవీఎస్ఎన్ వరప్రసాద్, పి.శ్రీదేవి, కార్యాలయ సిబ్బందిపాల్గొన్నారు.

మాధవధారలో..

మాధవధార, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) :జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం మురళీనగర్ ప్రాంతాల యువత నివాళులర్పించారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ , వైశాఖీ స్పోర్ట్సు పార్కుల్లో మహాత్ముని విగ్రహానికి క్లబ్ సభ్యులు, కార్యవర్గం పూలమాలలేసి నివాళులర్పించారు. 51వ వార్డు మాధవధార ఉడాకాలనీలో వార్డు కార్పొరేటర్ ఆర్.వెంకటరమణ సెంట్రల్ పార్కు కమిటీ సభ్యులతో పార్కు ప్రాంగణంలో మహాత్మాగాంధీ స్మారక విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు.

దసరా సంబరాలు

మాధవధార, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మాధవధార ప్రాంతాల్లో శుక్రవారం దసరా పండుగ సంబరాలను ఘనంగా నిర్వహించారు.మాధవధార బస్టాప్ దగ్గరి ఆటో యూనియన్ సంఘం అమ్మవారి ప్రతిమను శుక్రవారం ప్రతిష్ఠించి పూజాదికాలు ఆరంభించారు. మరోవైపు దసరా శరన్నవరాత్రి పూజాధికాల ముగింపు రోజైన శుక్రవారం మాధవధార సీతన్న గార్డెన్స్ శ్రీకనకమహాలక్ష్మి ఆలయం, కుంచుమాంబ ఆలయాలు సహా హైస్కూలు దగ్గరి లలితా దేవి ఆలయాల్లో ప్రత్యేక పూజాభిషేకాలు నిర్వహించారు. బర్మా క్యాంప్ నూకాంబిక ఆలయంలో ప్రతిష్ఠించిన అమ్మవారి ఉత్సవవిగ్రహ అనుపు ఉత్సవాల్నిచేపట్టారు. పలు యువజన సంఘాలు నిర్వహించిన శరన్నవరాత్రి సంబరాలముగింపుతో అనుపు ఉత్సవాలుఘనంగా జరిగాయి.


గండి బాబ్జీతో రామ్‌కుమార్, 34వార్డు టీడీపీ నాయకులు

గండి బాబ్జీని కలిసిన రామ్‌కుమార్

అల్లిపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ వాసుపల్లి రామ్‌కుమార్, టీడీపీ విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు గండి బాబ్జీ, దక్షిణ నియోజకవర్గం ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం ఆయన 34వ వార్డు నాయకులతో పాటు బాబ్జిని, సుధాకర్‌ను వారి నివాసాల్లో కలిశారు.ఈ కార్యక్రమంలో నాయకులు దానన సత్యనారాయణ, గనగళ్ల సత్య, కండేల రాజు, కారే రాజేశ్వరరావు, పుకళ్ల రాజేశ్వరి, సురేంద్ర, దాసు, అప్పారావు పాల్గొన్నారు.

ఘనంగా సాగర దుర్గా తెప్పోత్సవం

మహారాణిపేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : సాగర దుర్గా అమ్మవారి తెప్పోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో గత నెల 22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్న విషయం తెలిసిందే.శుక్రవారం సాయంత్రం ఆలయం నుంచి సాగర తీరం వరకు అమ్మవారిని పల్లకీలో ఊరేగించి, అనంతరం ప్రత్యేక బోటు మీద ఉంచి తెప్పోత్సవం నిర్వహించారు. పోర్టు నాలుగు వైపులా బోటును తిప్పి, ఉత్సవాన్ని ముగించారు.

బొమ్మల కొలువు...అభినందనీయం


బొమ్మల కొలువులో పాల్గొన్న మహిళలు

అక్కయ్యపాలెం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : దేశ సంస్కృతీ సంప్రదాయాలు, నీతి కథలు, ఇతిహాసాలు నేటి తరానికి అర్థమయ్యే రీతిలో బొమ్మల కొలువు ఏర్పాటు చేయడం అభినందనీయమని బీజేపీ నాయకురాలు శ్యామలా దీపిక అన్నారు. శంకర మఠంలో తల్లాప్రగడ మాణిక్యలక్ష్మి మనోరమ ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు గురువారంతో ముగిసింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దసరా నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన బొమ్మల కొలువులో వివిధ వృత్తులు, రాజులు, దేవతలు, పురాణాల పాత్రలను ప్రతిబింబించే బొమ్మలతో అద్భుతంగా తీర్చిదిద్దారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుహాసిని, తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబాకు అభిషేకాలు

అక్కయ్యపాలెం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : రైల్వే ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీసాయి ధ్యాన మందిరం వార్షికోత్సవాల్లో భాగంగా బాబాకు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. జస్టిస్ నిడుమోలు శ్రీలక్ష్మి బాబాను దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తుల స్వహస్తాలతో బాబాకు క్షీరాభిషేకం, కాశీ, హరిద్వార్ నుంచి తీసుకొచ్చిన రుద్రాక్షలకు అభిషేకం చేశారు. మధ్యాహ్నం హారతి అనంతరం మహా అన్న ప్రసాద వితరణ జరిగింది.


అల్లిపురం నేరెళ్ల కోనేరు మెయిన్ రోడ్డుపై కూలిన కొబ్బరి చెట్టు


అంబేడ్కర్ బస్టాప్ వద్ద దుస్థితి


రామ్‌నగర్‌లో కూలిన చెట్టు

ఈదురుగాలులకు కూలిన చెట్లు

డాబాగార్డెన్స్/అల్లిపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలో గురువారం ఉదయం వీచిన ఈదురుగాలులకు డాబా గార్డెన్స్ పరిసర ప్రాంతాల్లో పలుచోట్ల చెట్లు కూలిపోయాయి. అంబేడ్కర్ సర్కిల్ 48 బస్టాప్ వద్ద రోడ్డుకు అడ్డంగా చెట్లు కూలిపోవడంతో స్థానికులు రాకపో కలకు సిబ్బంది పడ్డారు. అలాగే అల్లిపురం, జ్ఞానాపురం ప్రాంతాల్లోనూ చెట్లు నేలకొరిగాయి. కొన్నిచోట్ల విద్యుత్ వైర్లపై కొమ్మలు పడడంతో సర ఫరాకు అంతరాయం ఏర్పడింది. ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల చాలా ప్రాంతాలకు సరఫరా లేదు. రైల్వే రిజర్వేషన్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్‌కు వెళ్లే రహదారిలో నేరెళ్ల కోనేరు వద్ద కొబ్బరిచెట్టు, కాన్వెంటు కూడలి నుంచి రామకృష్ణ జంక్షన్‌కు వెళ్లే రహదారిలో చెట్టు కూలిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం ఉదయం జీవీఎంసీ సిబ్బంది కూలిపోయిన చెట్లను తొలగించారు.

మహారాణిపేట : రామ్‌నగర్‌లో జీవీఎంసీ కార్యాలయం ఎదుట భారీ వృక్షం కారుపై పడింది. కారులో ఉన్న వారికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు, చెట్టు కూలిపోవడం వల్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. మహారాణిపేటలోని సెయింట్ ఆంథోనీ పాఠశాల వద్ద చెట్టు నేలకూలడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి. ట్రాఫిక్ కానిస్టేబుల్ రాజు, జనసేన వార్డు అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో చెట్టును తొలగించారు. జిల్లా కోర్టు, కేజీహెచ్ ఓపీ విభాగం గేటు వద్ద కూడా చెట్లు కూలిపోయాయి.

క్రీడాకారుడు లింగేశ్వరరావుకు అభినందనలు


ఎంపీ భరత్‌తో లింగేశ్వరరావు, ఉషశ్రీ

విశాఖపట్నం, స్పోర్ట్స్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : వరల్డ్ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ టోర్నీలో రజత పతకం సాధించిన షట్లర్ టీవీఎస్‌కే లింగేశ్వరరావును ఎంపీ శ్రీభరత్ శుక్రవారం తన కార్యాలయంలో అభినందించారు. థాయిలాండ్‌లో జరిగిన ఈ టోర్నీలో 55 ప్లస్ మిక్స్‌డ్ డబల్స్‌లో పార్టనర్ సజన్ వింగ్లెట్‌తో కలిసి రజత పతకం సాధించిన అంశాన్ని ఎంపీకు లింగేశ్వరరావు వివరించారు. లింగేశ్వరరావు ఇప్పటివరకు సాధించిన అంతర్జాతీయ పతకాల వివరాలను భరత్ అడిగి తెలుసుకున్నారు. వర్ధమాన ఔత్సాహిక క్రీడాకారులకు శిక్షణ ఇచ్చి ఉన్నత స్థాయి షట్లర్లగా తీర్చిదిద్దే విధంగా అకాడమీ ప్రారంభించాలని, అందుకు అవసరమైన సహాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్, షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ విశాఖ ప్రధాన కార్యదర్శి ఉషశ్రీ కూడా పాల్గొన్నారు.

గూగుల్‌ను అడ్డుకునేందుకు వైసీపీ కుట్ర

- దక్షిణ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ సుధాకర్

విశాఖపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఏపీని గ్లోబల్ మ్యాప్‌పై నిలబెట్టేందుకు కూటమి ప్రభుత్వం పలు కంపెనీలను విశాఖకు తీసుకువస్తోందని, వాటిలో గూగుల్ ఒకటని దక్షిణ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ వైస్ చైర్మన్ సీతంరాజు సుధాకర్ అన్నారు. గూగుల్ సంస్థ విశాఖకు రాకుండా అడ్డుకునేందుకు వైసీపీ వేసిన మాస్టర్ ప్లాన్ విఫలమైందని వెల్లడించారు. ఈమేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకువచ్చి, అభివృద్ధి చేయాలని చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆ ప్రయత్నాలను అడ్డుకోవడమే లక్ష్యంగా వైసీపీ వ్యవహరిస్తోందని ఆరోపించారు. టీసీఎస్‌కు 99 పైసలకే భూమి కేటాయిస్తే దానిపై వైసీపీ నేతలు కోర్టును ఆశ్రయించి చీవాట్లు తిన్నారన్నారు. గూగుల్‌ను విశాఖకు రప్పించేందుకు మంత్రి లోకేశ్ నేతృత్వంలో కృషి చేస్తున్నారని, ఈమేరకు తర్లువాడలో రైతులకు ఎకరాకు రూ.19.55 లక్షలు చెల్లించి భూసేకరణకు సిద్ధమవుతుంటే వైసీపీ నేతలు కోర్టుల్లో కేసులు వేశారన్నారు. వైసీపీ మాస్టర్ ప్లాన్ ప్లాప్ అయిందని, గూగుల్ రాకను ఎవరూ అడ్డుకోలేరని స్పష్టం చేశారు.


గాంధీజీ విగ్రహం నివాళి అర్పిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, తదితరులు

కలెక్టరేట్‌లో గాంధీజీ, శాస్త్రి జయంతి

మహారాణిపేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ గాంధీజీ చూపిన బాటలో నడవాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ కోరారు. ఆయన కలెక్టరేట్ ఆవరణలో ఉన్న గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు, అనంతరం మాట్లాడుతూ గాంధీజీ జీవితం చరిత్రలో ఎప్పటికీ చిరస్మరణీయంగా ఉంటుందని చెప్పారు. అలాగే లాల్ బహు దూర్ శాస్త్రి జయంతి కూడా కావడంతో ఆయన చిత్రపటా నికి పూలమాల వేసి, నివాళి అర్పించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

విశాఖపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : గాంధీజీ జయంతి పురస్కరించుకుని వాల్తేరు రైల్వే గురువారం స్వచ్ఛతా దివాస్ నిర్వహించింది. విశాఖ స్టేషన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి డీఆర్ఎం లలిత్ బొహ్రా హాజరై గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం స్టేషన్‌లో పారిశుధ్య నిర్వహణకు వినియోగిస్తున్న బ్యాటరీ వాహనాలు, ఆధునిక పరికరాల పనితీరును పరిశీలించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ గాంధీ సూత్రాలను అనుసరించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ముఖ్యంగా పరిశుభ్రత నిరంతర ప్రక్రియగా భావించి, పరిసర ప్రాంతాలను శుభ్రం చేసుకుని స్వచ్ఛ భారత్‌కు సహకరించాలని కోరారు. అనంతరం పారిశుధ్య కార్మికులతో కలిసి ప్లాట్‌ఫామ్‌లు, పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు మనోజ్‌కుమార్ సాహు, ఈ. శాంతారామ్, తది తరులు పాల్గొన్నారు.

మహిళా క్రికెట్ సందడి

... 5వ పేజీ తరువాయి

టికెట్ల (రూ.499)ను ఆన్‌లైన్‌లో అమ్మకాలకు ఉంచారు.

భారత్, దక్షిణాఫ్రికా మ్యాచ్‌కు టికెట్ ధర రూ.150

మ్యాచ్‌ల ఏర్పాట్లలో భాగంగా శుక్రవారం స్టేడియంలో కలెక్టర్ హరేంధరప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, పోలీస్ కమిషనర్ శంకబ్రాత బాగ్చి, డీసీపీ-2 మేరీ ప్రశాంతి, ఏసీఏ ప్రతినిధులు సమావేశమ య్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరేంధర్‌ప్రసాద్ మాట్లాడుతూ స్టేడియం చుట్టూ తగిన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ సీసీ టీవీ నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏసీఏ ప్రతినిధులు మాట్లాడుతూ టికెట్ ధర ఈనెల 9న భారత్, దక్షిణాఫ్రికా మధ్య జరగనున్న మ్యాచ్‌కు రూ.150గా, మిగిలిన మ్యాచ్‌లకు రూ.100గా నిర్ణయించామన్నారు.

పెనుగాలుల బీభత్సం

... 5వ పేజీ తరువాయి

ఒరిగిపోయాయి. జీవీఎంసీ కార్యాలయం సమీపానున్న ఒక షాపింగ్ కాంప్లెక్స్‌లో పెద్ద హోర్డింగ్ ఏర్పాటుచేయగా గాలులకు అది గోడతో సహా కూలిపోయింది. పలుచోట్ల చెట్లు పడి కార్లు, ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. చెట్లు, కొమ్మలు విరిగి అడ్డంగా పడడంతో వర్షం తెరిపిచ్చిన తరువాత రోడ్లపైకి వచ్చిన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జీవీఎంసీ అధికారులు యుద్ధ ప్రాతిపదికన రంగంలో దిగి విరిగిన చెట్లను, కొమ్మలను పక్కకు తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు. ప్రజారోగ్యం, ఉద్యానవన, మెకానికల్ సిబ్బంది అంతా ఇవే పనుల్లో నిమగ్నమయ్యారు. కమిషనర్ కేతన్ గార్గ్ దగ్గరుండి పనులు పర్యవేక్షించారు. ఇందుకోసం ఎనిమిది ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. చెట్ల తొలగింపునకు 17 జేసీబీలను తీసుకువచ్చారు. శుక్రవారం సాయంత్రానికి 145 చెట్లు తొలగించారు. మిగిలిన చెట్ల తొలగింపు పనులు కొనసాగుతున్నాయి. జీవీఎంసీ పరిధిలో తొమ్మిది విద్యుత్ స్తంభాలు నేలకొరిగినట్టు గుర్తించి, వాటిని కూడా పునరుద్ధరించే చర్యలు చేపట్టారు.

చికెన్ వ్యర్థాలపై పోలీస్ పంచాయితీ

... 5వ పేజీ తరువాయి

ఆశీస్సులతో అనధికారికంగా చికెన్ వ్యర్థాల సేకరణ మొదలెట్టారు. అతని వాహనాలను జీవీఎంసీ నుంచి టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు పట్టుకుని అధికారులకు అప్పగించడం మొదలుపెట్టారు. అందుకు ప్రతిగా సదరు వైసీపీ చోటా నేత కూడా చికెన్ వ్యర్థాలను చేపల చెరువులకు తరలిస్తున్న కాంట్రాక్టర్ల వాహనాలను పట్టుకుని పోలీసులకు, జీవీఎంసీ అధికారులకు అప్పగించారు. దీనిపై కౌన్సిల్ సమావేశంలో చర్చ జరగడంతో ఈ వ్యవహారానికి బాధ్యుడైన చీఫ్ వెటర్నరీ అధికారి డాక్టర్ కిషోర్‌ను జీవీఎంసీ నుంచి సరండర్ చేశారు. ఇదిలావుండగా సదరు వైసీపీ చోటా నేత ఇటీవల తమను పిలిచి వాటా కావాలని, ఇవ్వకపోతే ఇబ్బందులు పడాల్సి ఉంటుందని, వాహనాలను తిరగనివ్వనని బెదిరించారంటూ కాంట్రాక్టర్లంతా నగరంలోని ఒక ప్రజా ప్రతినిధిని కలిసి ఫిర్యాదు చేశారు. వైసీపీకి చెందిన నేత బెదిరింపులకు దిగడం, అధికారులు అతనికి వత్తాసు పలకడం ఏమిటని ఆగ్రహం వ్యక్తంచేసిన సదరు ప్రజా ప్రతినిధి నేరుగా నగర పోలీస్ కమిషనర్‌కు ఫోన్ చేసి విషయాన్ని వివరించినట్టు తెలిసింది. కాంట్రాక్టర్లు కూడా సీపీని కలిసి తమ ఇబ్బందులను వివరించడంతో దీనిపై విచారణ జరిపి భవిష్యత్తులో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాలని టాస్క్‌ఫోర్స్ పోలీసులను ఆయన ఆదేశించారు. సీపీ ఆదేశాలతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు సదరు వైసీపీ చోటా నేతను రెండు రోజుల కిందట స్టేషన్‌కు పిలిచారు. వాహనాలను అడ్డుకున్నా, బెదిరింపులకు దిగినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఆ సమయంలో కూటమికి చెందిన నేత ఒకరు...టాస్క్‌ఫోర్స్ పోలీసులకు ఫోన్ చేసి వైసీపీ చోటా నేతను తక్షణం విడిచిపెట్టాలని కోరారు. ఈ సందర్భంగా పోలీసులకు, కూటమి నేతకు మధ్య గట్టిగా వాదన జరిగినట్టు ప్రచారం జరుగుతోంది. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు సీపీ దృష్టికి తీసుకువెళ్లినట్టు చెబుతున్నారు.

గూగుల్ డేటా సెంటర్‌కు మోకాలడ్డు!

... 5వ పేజీ తరువాయి

క్షేత్రస్థాయిలో పర్యటించి ఎంజాయ్‌మెంట్ సర్వే చేసి ప్రతి రైతు నుంచి సమాచారం సేకరించారు. గ్రామంలో ప్రభుత్వానికి చెందిన 308 ఎకరాలు, ప్రైవేటు భూమి మరో ఎనిమిది ఎకరాలు సేకరించేందుకు అన్ని రకాల సర్వేలు పూర్తిచేసి అనంతరం గ్రామ సభ పెట్టారు. ప్రతి రైతు పేరు చదివి అతనికి చెందిన భూ విస్తీర్ణం వివరాలు వెల్లడించారు. ప్రభుత్వ భూమిలో సుమారు 120 మంది రైతులు ఉన్నట్టు గుర్తించారు. భూసేకరణ కోసం జీవో 571 ప్రకారం రైతులకు పరిహారం ఇవ్వనున్నారు. పట్టా రైతులకు బేసిక్ విలువపై రెండున్నర రెట్లు అందజేసే అవకాశం ఉంది. అయితే గత ప్రభుత్వంలో రైతులకు అడ్వాన్స్‌లు ఇచ్చిన బ్రోకర్లు ఇటీవల గ్రామానికి వచ్చి తమకు ఇస్తామన్న భూముల సంగతి ఏమిటని ప్రశ్నించడంతోపాటు వారిని రెచ్చగొట్టేందుకు యత్నించారని తెలిసింది. ప్రభుత్వం ఇచ్చే పరిహారం కంటే ఎక్కువ ఇస్తామని కొంతమంది రైతులను రెచ్చగొట్టడంతో వారంతా కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. భూసేకరణ కోసం తమకు నోటీసులు ఇవ్వలేదని ఇతరత్రా అంశాలపై నిబంధనలు పాటించలేదని పేర్కొంటూకోర్టుకు వెళ్లడంతో రెవెన్యూ యంత్రాంగం పూర్తి వివరాలు సమర్పించింది. దీంతో రిట్ పిటిషన్‌ను కోర్టు డిస్పోజ్ చేసింది. దీంతో కంగుతిన్న బ్రోకర్లు...మరికొంతమంది రైతులను రెచ్చగొట్టి కోర్టుకు వెళ్లేందుకు పురిగొల్పే ప్రయత్నం చేస్తున్నారని గ్రామంలో ప్రచారం సాగుతుంది. ఇదిలావుండగా పరిహారం విషయమై స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పలుమార్లు అధికారులతో సమావేశాలు నిర్వహించడంతో పాటు ముఖ్యమంత్రిదృష్టికి తీసుకువెళ్లడంతో సానుకూల ప్రకటన వచ్చింది. రైతులకు అన్నివిధాలా న్యాయం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న తరుణంలో భూసేకరణకు మోకాలడ్డడంపై పూర్తిస్థాయి విచారణ చేయనున్నట్టుతెలిసింది.

స్వచ్ఛాంధ్ర పురస్కారాలు

... 5వ పేజీ తరువాయి

సంతోషంగా ఉందని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో 42 విభాగాలకు అవార్డులు ప్రకటించినట్టు పేర్కొన్నారు. ఈనెల ఆరో తేదీన అవార్డులను జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోల శ్రీబాలవీరాంజనేయస్వామి చేతుల మీదుగా ప్రదానం చేస్తామన్నారు.

స్వచ్ఛ గ్రామ పంచాయతీలు: పెద్దిపాలెం, నగరంపాలెం, తాటితూరు, గంభీరం, వేములవలస

స్వచ్ఛ స్లమ్ లెవెల్ ఫెడరేషన్లు: బాలాజీరావుపేట త్రీ ఎంఎసీఎస్, శ్రీసంపత్ వినాయక

స్వచ్ఛ గ్రామ స్థాయి ఆర్గనైజేషన్స్: పాలవలస, మజ్జివలస, కొవ్వాడ, పొట్నూరు

స్వచ్ఛ బస్ స్టేషన్: ద్వారకా బస్‌స్టేషన్

ఉత్తమ ఎన్జీవోలు: సెంటర్ ఫర్ యూత్ డెవలప్‌మెంట్ అండ్ యాక్టివిటీస్ (ఆనందపురం), శ్రీతిరుమల నగర్ (జీవీఎంసీ).

స్వచ్ఛ ఆస్పత్రులు: కణితి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, జీవీఎంసీలో 56వ వార్డు, మధురవాడలోని జీపీడీ

స్వచ్ఛ పాఠశాలలు: వేపగుంట జడ్పీ ఉన్నత పాఠశాల, అగనంపూడి జడ్పీ ఉన్నత పాఠశాల, గాంధీగ్రామ్ మునిసిపల్ ఉన్నత పాఠశాల, భీమిలి కేజీబీవీ

స్వచ్ఛ అంగన్‌వాడీ కేంద్రాలు: సంజయ్‌గాంధీ కాలనీ, విజయపురం (విశాఖ), మజ్జివలస, తాళ్లవలస (భీమిలి), 77వ వార్డు (విశాఖ రూరల్)లోని కేంద్రాలు

స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయాలు: జిల్లా పరిషత్ కార్యాలయం, భీమిలిలోని జీవీఎంసీ జోనల్ కార్యాలయం, పెందుర్తిలోని డీఆర్‌డీఏ కార్యాలయం

స్వచ్ఛ భారీ పరిశ్రమ: డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీ

స్వచ్ఛ చిన్న/మధ్యతరహా పరిశ్రమ: ఎంఎస్ఆర్ లెదర్ పరిశ్రమ

స్వచ్ఛ వసతిగృహాలు: సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం, బీసీ బాలురు వసతిగృహం (ఆనందపురం), గిరిజన సంక్షేమ శాఖ పీఎం కళాశాల బాలికల వసతిగృహం (విశాఖపట్నం).

స్వచ్ఛ రెసిడెన్సియల్ స్కూలు: కొమ్మాదిలోని సాంఘిక సంక్షేమ శాఖ రెసిడెన్సియల్ స్కూలు ఆఫ్ ఎక్సలెన్స్

స్వచ్ఛ వారియర్స్: రిట్టిపిల్లి అప్పలపైడమ్మ (జీవీఎంసీ జోన్-1), వేమలి అరుణకుమారి (జోన్-3), నూకూల్ల లక్ష్మి (జోన్ 4), ధనాల పైడిరాజు (జీవీఎంసీ జోన్-6),యానపు దేవుడు (జోన్-8).

స్వచ్ఛ గ్రీన్ అంబాసిడర్లు: నూరచిన్న (వెల్లంకి), వాదా సత్యనారాయణ (టి.నగరంపాలెం), చలపాక సూర్యనారాయణ, బందా మరిడమ్మ (పినగాడి), పారుపల్లి రాంబాబు (వేములవలస)

రాష్ట్రస్థాయి స్వచ్ఛ కాలనీగా తిరుమల నగర్


తిరుమల నగర్ కాలనీ వ్యూ



కాలనీలో గోడపై పర్యావరణ రక్షణ కోసం వేసిన పేయింటింగ్


గొరపల్లి గ్రామం వ్యూ

- అవగాహన వల్లే ఇది సాధ్యమంటున్న కాలనీ ప్రతినిధి కె.పరమానందం
- 27వ అవార్డు సొంతం చేసుకున్న ఆనందంలో కాలనీ వాసులు
- జిల్లా స్థాయి స్వచ్ఛ విలేజ్ అవార్డు సొంతం చేసుకున్న గొరపల్లి
- పంచాయతీ సిబ్బంది అత్యుత్తమ పనితీరుతో అవార్డు కైవసం

కూర్మన్నపాలెం,అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87 వార్డు తిరుమల నగర్ కాలనీకి 2025 రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆర్‌డబ్ల్యూఏ) విభాగంలో రాష్ట్ర జిల్లా స్థాయిలో అవార్డును దక్కించుకుంది. గాంధీ జయంతిని పురస్కరించుకుని ఈ అవార్డును రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈనెల 6వ తేదీన సీఎం నారా చంద్రబాబునాయుడు ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. తమ కాలనీకి ఈ అవార్డు దక్కడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇది ఓ కాలనీ గెలుపు కథ అని, కాలనీ వాసుల కృషి వల్లే ఈ గౌరవం దక్కిందని కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు జి. విశ్వేశ్వరరావు, పరమానందం, పరమేశ్వరరావు, సన్యాసిరావు పేర్కొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా ఇంకుడు గుంతలు

కాలనీలో ఉన్న ఇళ్లలో 100 ఇంకుడు గుంతలు తవ్వించి 16 లక్షల లీటర్ల నీటిని ఆదా చేశారు. రహదారులు పక్కన 42, పార్కుల్లో 20 ఇంకుడు గుంతలు తవ్వి 30.97 లక్షల లీటర్ల వర్షపు నీటిని ఆదా చేశారు. అలాగే కాలనీలోని సుమారు 4వేల మొక్కలను నాటి పర్యావరణాన్ని రక్షిస్తున్నారు.

ఈ కాలనీకి అవార్డులు కొత్తకాదు

తిరుమల నగర్ కాలనీ ఇప్పటి వరకు 27 అవార్డులను దక్కించుకోవడంతో ప్రత్యేక గుర్తింపును సంతరించుకుంది. జాతీయ స్థాయి అవార్డులు7, రాష్ట్ర స్థాయిలో 3, జోనల్, జిల్లా స్థాయిలో 17 అవార్డులు అందుకుని తోటి కాలనీలకు ఆదర్శంగా నిలిచింది. అలాగే 2020లో కేంద్ర జల వనరుల శాఖ నుంచి వాటర్ హీరో అవార్డు ఈ కాలనీ ప్రతినిధి కె. పరమానందానికి దక్కింది. 2023 సంవత్సరం 5వ జలశక్తి అవార్డుల్లో భాగంగా తిరుమల నగర్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు 3వ ర్యాంకు దక్కింది.

చైతన్యంతోనే సాధ్యం

కాలనీల్లో పరిశుభ్రత పాటిస్తూ, నార సంచులను, స్టీల్ పాత్రలను వినియోగిస్తూ ప్లాస్టిక్, పాలథిన్ నియంత్రణకు శ్రీకారం చుట్టారు. ప్రతి ఇంటిని సేంద్రియ ఎరువులను తయారు చేస్తూ మొక్కలు పెంచుతున్నారు. మొక్కల పెంపకంలో ఆసక్తి ఉన్నవారికి ఉచితంగా ఎరువులను పంపిణీ చేస్తున్నారు. 'తిరుమల నగర్ ఆర్‌డబ్ల్యూఏ యూ ట్యూబ్ చానల్' ద్వారా మిగతా వారికి అవగాహన కల్పిస్తున్నారు. ఏటా జీవీఎంసీ సహకారంతో నిర్వహించే స్వచ్ఛ భారత్, కాలుష్య నివారణ, సీజనల్ వ్యాధుల ర్యాలీలలో కాలనీ వాసులు పాల్గొంటున్నారు. ఎన్నో అవార్డులను సొంతం చేసుకుంటూ దేశవ్యాప్తంగా నిర్వహించే స్వచ్ఛ పోటీల్లో జీవీఎంసీకి ర్యాంకులు రావడానికి ఈ కాలనీలోని కార్యక్రమాలు దోహదపడుతున్నాయనడంలో అతిశయోక్తి లేదు.

జిల్లా స్థాయి స్వచ్ఛ విలేజ్‌గా గొరపల్లి

పెందుర్తి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలో గొరపల్లి గ్రామానికి రాష్ట్ర స్థాయిలో స్వచ్ఛ విలేజ్ పురస్కారం దక్కింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రలో భాగంగా సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 వరకు గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ క్రమంలో పంచాయతీ పరిధిలో ఉన్న గొరపల్లి, కరకవానిపాలెం, గంగమ్మపేట గ్రామాల్లో పారిశుధ్యం, ఇంటింటి చెత్త సేకరణ, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ల పనితీరు, డ్రైనేజీ మురుగు తొలగింపు అంశాల్లో పంచాయతీ సిబ్బంది అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి మంచి ఫలితాలు రాబట్టారు. దీంతో రాష్ట్ర స్థాయిలో గొరపల్లి గ్రామానికి స్వచ్ఛ విలేజ్ అవార్డు లభించింది.

నడుపూరు హైస్కూల్‌కు రాష్ట్రస్థాయి అవార్డు


పచ్చదనంతో నడుపూరు హైస్కూల్


ప్రైవేటు పాఠశాలలకు దీటుగా మరుగుదొడ్ల నిర్వహణ


అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణం

- రాష్ట్రంలో 'హ్యాండ్ వాష్ పాయింట్స్' ఉన్న ఏకైక పాఠశాలగా గుర్తింపు
- రామవనం, రుద్రాక్షవనం ప్రత్యేక ఆకర్షణ
- జిల్లా స్థాయి స్వచ్ఛ పాఠశాలగా అగనంపూడి జడ్పీ హైస్కూల్

పెదగంట్యాడ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రాష్ట్రస్థాయిలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర 2025 అవార్డును దక్కించుకుంది. రాష్ట్రస్థాయిలో పాఠశాలల విభాగంలో మూడు పాఠశాలలను ఎంపిక చేయగా అందులో నడుపూరు హైస్కూల్ ఒకటి. ఈ అవార్డు కోసం జిల్లా నుంచి ఐదు పాఠశాలలను ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి పంపించారు. థర్డ్‌పార్టీ వాల్యూషన్ జరిగి రాష్ట్రంలో మూడు పాఠశాలలను ఎంపిక చేశారు. పరిశుభ్రత, పచ్చదనం, నీటి వినియోగం, నీటి సంరక్షణ చేతుల పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ, వేస్ట్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని గ్రేడులను కేటాయించారు. దీనిలో నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు ఫైవ్‌స్టార్ రేటింగ్ వచ్చి అవార్డుకు ఎంపికైయింది. విజయవాడలో సోమవారం జరగనున్న అవార్డుల ప్రదానోత్సవంలో హైస్కూల్ హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్ పాల్గొని సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఈ అవార్డును అందుకోనున్నారు. తమ పాఠశాలకు అవార్డు దక్కడ ం పట్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేక ఆకర్షణగా మొక్కల పెంపకం

రామాయణంలో పాత్రల పేర్లతో మొక్కలను నాటి వాటిని పెంచుతున్నారు. ఇందులో భాగంగా రామవనంలో రామఫలం, సీతాఫలం, లక్ష్మణఫలం, హనుమాన్ ఫలం మొక్కలను పెంచారు. రుద్రాక్షవనం ఈ పాఠశాల ప్రత్యేకం. ఇందులో ఔషధగుణాలు కలిగిన మారేడు, లెమన్‌గ్రాస్, నాగమల్లి, అరికేపం, రాయల్‌పా వంటి మొక్కలను పెంచారు. కిచెన్ గార్డెన్‌లో బొప్పాయి, పోక మొక్కలు, తమలపాకు, ఆకుకూరల మొక్కలు పెంచుతున్నారు.

పాఠశాలలో సౌర విద్యుత్తు వినియోగం

పాఠశాలలో సౌర విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. ఈ సందర్భంగా సౌరవిద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి పాఠశాల నిర్వహణకు విద్యుత్‌ను వినియోగించుకుంటున్నారు. అలాగే తరగతి గదులు, కారిడార్లు, పరిశుభ్రంగా ఉంచుకుంటుఉన్నారు. రాష్ట్రంలో హ్యాండ్ వాష్ పాయింట్స్ ఉన్న ఏకైక పాఠశాల ఇది మాత్రమే.

జిల్లా స్థాయి స్వచ్ఛ పాఠశాలగా అగనంపూడి జడ్పీ ఉన్నత పాఠశాల

అగనంపూడి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గాంధీ జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వం అందిస్తున్న స్వచ్ఛ అవార్డు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దక్కింది. స్వచ్ఛ స్కూల్స్ విభాగంలో 2025గాను జిల్లా స్థాయిలో ఈ అవార్డు పాఠశాలకు దక్కినట్టు హెచ్‌ఎం కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ పట్ల విద్యార్థుల్లో నిత్యం విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడంతో పాటు పాఠశాల ప్రాంగణంలో వివిధ మొక్కలు నాటడం, ప్రతిరోజు పాఠశాలను సుందరంగా తీర్చిదిద్దడం వల్లే ఈ అవార్డు లభించిందని అన్నారు. తడి, పొడి చెత్త సేకరణ, మరుగుదొడ్ల శుభ్రం, పరిసరాల పరిశుభ్రత విషయాల్లో విద్యార్థులను చైతన్యం చేయడం, నిరంతర కృషి వల్ల పాఠశాలకు ఈ గౌరవం దక్కిందన్నారు. భవిష్యత్తులో ఇదే స్ఫూర్తితో ముందుకు సాగి రాష్ట్ర స్థాయిలో అవార్డును సాధించడమే లక్ష్యమని అన్నారు.

అవగాహన వల్లే సాధ్యమయింది



స్వచ్ఛత, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం వల్లే పాఠశాల చెట్లు, ఉద్యానవనాలతో ఇంపుగా ఉంది. ఎన్నో రకాల పూల మొక్కలు నాటాం. పూల నుంచి వచ్చే సువాసనల వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఎంతో ఆహ్లాదంగా ఉన్నది. హైస్కూల్ స్థలం సరిహద్దుల్లో మొక్కలు నాటి వాటిని దట్టమైన వృక్షాలుగా తయారు చేయాలన్న ఆలోచన ఉంది.

రాచకొండ శ్రీనివాస్, హెచ్‌ఎం (నడుపూరు హైస్కూల్)

స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలి

- కేంద్ర భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ
- బీచ్ రోడ్డులో ప్రారంభమైన ఖాదీ సంత


బీచ్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఖాదీ సంతలో రాట్నం ఒడుకుతున్న కేంద్ర భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, తదితర నాయకులు

బీచ్ రోడ్డు, అక్టోబరు 3, (ఆంధ్రజ్యోతి): దేశ పురోగతికి స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డు విశ్వప్రియ ఫంక్షన్ హాల్ ఎదురుగా ఏర్పాటు చేసిన ఖాదీ సంతను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడుతూ ఖాదీ ఉద్యమ స్ఫూర్తిని చాటేలా అన్ని జిల్లాల్లో 90 రోజుల పాటు ఖాదీ సంతలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. స్వదేశీ ఉత్పత్తుల కొనుగోలుతో అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ప్రధానమంత్రి మోదీ స్వదేశీ నినాదం తీసుకొచ్చారన్నారు. అమెరికా టారిఫ్‌లతో అందరిపైనా ప్రభావం పడుతుందని, దిగుమతులపై ఆధారపడడం తప్పనిసరి కాదన్నారు. స్వదేశీ వస్తువుల తయారీ, వినియోగం పెరగాలని, ఏటికొప్పాక, కొండపల్లి కళలను, చేనేత పరిశ్రమను ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. భారత ఆర్థిక వ్యవస్థ 2038 నాటికి ప్రపంచంలో రెండో స్థానానికి, 2047 నాటికి అగ్రస్థానానికి చేరుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగులకు ఉపాధి కల్పించి స్వయంసమృద్ధి దిశగా నడిపించేందుకు గాంధీ ఖాదీ భావనను అభివృద్ధి చేశారన్నారు. ప్రధానమంత్రి మోదీ దేశంకోసం ఖాదీ, ఫ్యాషన్ కోసం ఖాళీ అనే మంత్రాన్ని తీసుకొచ్చారని వెల్లడించారు. అనంతరం గాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఖాదీ సంతలో స్టాళ్లను సందర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కోశాధికారి ఎం.నాగేంద్ర, అధికార ప్రతినిధి సుహాసిని, జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, తదితరులు పాల్గొన్నారు.

బోటు బోల్తాపడి మత్స్యకారుడి మృతి


నూకరాజు (ఫైల్ ఫొటో)

విశాలాక్షినగర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): వేట సాగించి తీరానికి చేరుకునే సమయంలో బోటు బోల్తాపడడంతో మత్స్యకారుడు మృతిచెందాడు. ఆరిలోవ ఎస్‌ఐ శంకర్ తెలిపిన వివరాల మేరకు.. జోడుగుళ్లపాలేనికి చెందిన మత్స్యకారులు శుక్రవారం వేకువజామున మూడు గంటలకు చేపట వేటకు బోటులో సముద్రంలోకి వెళ్లారు. తిరిగి 10.30 గంటలకు తీరానికి చేరుకునే క్రమంలో అలలు ఉధృతమవడంతో బోటు బోల్తా పడింది. ఈ ఘటనలో గరికిన నూకరాజు (36) బోటు కింద చిక్కుకుని తిరిగి సముద్రంలోకి కొట్టుకుపోయాడు. దీంతో సహచరులు బోటులో సముద్రంలోకి వెళ్లి గాలించగా ఆచూకీ లభించింది. అతడ్ని తీరానికి చేర్చి చూడగా అప్పటికే మృతిచెందాడు. మృతుడికి భార్య పూర్ణ, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. ఈ ఘటనలో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించి, మృతుడి తండ్రి గురుమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిని కాపాడిన లైఫ్ గార్డ్స్


లైఫ్ గార్డ్స్ రక్షించిన యువకుడు

బీచ్ రోడ్డు, అక్టోబరు 3, (ఆంధ్రజ్యోతి): సముద్ర స్నానానికి దిగిన ఓ యువకుడు కెరటాల ఉధృతికి కొట్టుకుపోతుండగా లైఫ్‌గార్డ్స్ రక్షించారు. మహారాష్ట్రకు చెందిన నాగపూర్ ఆన్స్ రాథోడ్ (20) నాగపూర్‌లో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. స్నేహితులతో కలిసి అనకాపల్లిలో జరుగుతున్న శివ గర్జన కార్యక్రమానికి వచ్చాడు. కార్యక్రమం అనంతరం ఆర్కే బీచ్‌కు వచ్చి సముద్రంలో స్నానానికి దిగాడు. అయితే అలల ఉధృతి ఎక్కువవడంతో గల్లంతయ్యాడు. గమనించిన మెరైన్ పోలీసులు, జీవీఎంసీ లైఫ్ గార్డులు పోలరాజు అతడిని రక్షించారు.


బి.సత్యనారాయణ

ప్రభుత్వ న్యాయవాదిగా బి.సత్యనారాయణ

విశాఖపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టుల ప్రభుత్వ న్యాయవాదిగా సీనియర్ న్యాయవాది బి.సత్యనారాయణను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ లీగల్ అండ్ లెజిస్లేటివ్ కార్యదర్శి గొట్టాపు ప్రభావతి ఆదేశాలు జారీచేశారు. మూడు ఏళ్ల పాటు న్యాయవాది సత్యనారాయణ ఈ పదవిలో ఉంటారని పేర్కొన్నారు. జిల్లా కోర్టులకు సంబంధించి సివిల్ కేసులు ప్రభుత్వం తరుపున వాదిస్తారని పేర్కొన్నారు. విశాఖ జిల్లాలో సీనియర్ న్యాయవాదిగా ఉన్న బి.సత్యనారాయణను ప్రభుత్వ న్యాయవాధిగా నియమించడం పట్ల బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, కమిటీ సభ్యులు సత్యనారాయణను అభినందించారు.

అక్రమ మద్యం పట్టివేత

పెందుర్తి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఓ ఇంటిలో మద్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అతని దగ్గర నుంచి 105 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. సీఐ కేవీ సతీశ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గవరజగ్గయ్యపాలెంలో బింగినేడి శ్రీను అనే వ్యక్తి ఇంటిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో అతని వద్ద నుంచి 105 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ శక్తి టీమ్ హోమ్‌గార్డు మృతి


అప్పలనాయుడు (ఫైల్ ఫొటో)

పెందుర్తి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): కుటుంబంలో ఏర్పడిన ఆర్థిక సమస్యల గురించి భార్యతో చర్చిస్తున్నప్పుడు జరిగిన గొడవ జరిగిన కోపంలో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన హోమ్‌గార్డు కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం వేపగుంటలోని ముత్యమాంబ కాలనీలో నివసిస్తున్న రుద్ర అప్పలనాయుడు(43) నగర పోలీస్ విభాగంలో హోమ్ గార్డుగా విధులు నిర్వహించేవాడు. గత నెల 30వ తేదీ రాత్రి కుటుంబంలో ఏర్పడిన ఆర్థిక సమస్యల గురించి భార్యతో చర్చించాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య తగదా జరిగింది. దీంతో ఆగ్రహించిన అప్పలనాయుడు ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. భార్య కల్యాణి పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి తలుపులు బద్దలు కొట్టి అప్పలనాయుడును కిందికి దించారు. వెంటనే కేజీహెచ్‌కు తరలించారు. మూడు రోజులుగా చికిత్స పొందుతున్న అప్పలనాయుడు శుక్రవారం మృతి చెందాడు. పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సినిమా గైడ్

- **కాంతార2** : మెలోడి, శరత్, శ్రీరామా, శ్రీకన్య, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2(104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **ఓజీ** : శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, , లీలామహల్, కిన్నెర, కామేశ్వరి, వెంకటేశ్వర-1,2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి**: లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1(పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఘాటీ** : ముక్తాస్, (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 23, వంకాయలు (తెలుపు) 48, వంకాయలు (నలుపు) 44, బెండకాయలు 20, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 36, బీరకాయలు 32, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 54, దొండకాయలు 42, బంగాళదుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది) 72, బరబాటి 38, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 66, కీరదోస 32, కాప్సికమ్ 68, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 32, చిలగడదుంపలు 32, కంద 40, దేముడు చిక్కుడు 64, గోరుచిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మా మిడి అల్లం 80, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	510
విజయనగరం	514
శ్రీకాకుళం	514

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	120
లైవ్ ధర	140
విత్ స్కిన్	250
స్కిన్‌లెస్	260


ముఖ్యమంత్రిని కలిసిన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, గిరిజన సహకార సంస్థ వైస్ చైర్మన్ కల్పనాకుమారి

అరకు కాఫీకి జాతీయ అవార్డు

- సీఎంను కలిసిన గిరిజన సహకార సంస్థ వైస్ చైర్మన్ కల్పనాకుమారి

విశాఖపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గిరిజన సహకార సంస్థకు చెందిన అరకు వ్యాలీ కాఫీకి ఫైనాన్సియల్ ట్రాన్స్‌ఫర్మేషన్ విభాగంలో చేంజ్ మేకర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు -2025 లభించింది. ఈ అవార్డును గత నెల 26న ముంబాయిలో జరిగిన బిజినెస్ లైన్ చేంజ్ మేకర్ అవార్డు కార్యక్రమంలో కేంద్ర పెట్రోలియం, సహజ వాయు శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పూరి చేతుల మీదుగా గిరిజన సహకార సంస్థ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కల్పనకుమారి అందుకున్నారు. ఈ క్రమంలో అవార్డు, ప్రశాంస పత్రాన్ని శుక్రవారం అమరావతిలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణితో కలిసి కల్పనకుమారి సీఎం చంద్రబాబునాయుడును కలిశారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గిరిజన సహకార సంస్థ ఎండీ కల్పనకుమారి మాట్లాడుతూ అరకు కాఫీకు అవార్డు దక్కడం గొప్ప విషయమని, ఈ అవార్డు గిరిజన రైతులు, జీసీసీ సిబ్బందికి అంకితమని పేర్కొన్నారు. అరకు కాఫీ ఒక బ్రాండ్ మాత్రమే కాదని, ఇది గిరిజనుల గౌరవానికి, భారతదేశ గర్వానికి ప్రతిక అని పేర్కొన్నారు.

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దండి

- పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ విజయభాస్కర్


శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఆర్జేడీ విజయభాస్కర్

విశాఖపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉత్తమ పౌరులగా తీర్చిదిద్దేలా పాఠాలు బోధించాలని నూతన ఉపాధ్యాయులకు పాఠశాల విద్యాశాఖ ప్రాంతీయ సంచాలకుడు విజయభాస్కర్ సూచించారు. ఉమ్మడి జిల్లాలో శుక్రవారం ఐదుచోట్ల శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి. మధురవాడ శ్రీకళాసా ఎడ్యుకేషనల్ సంస్థలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయవృత్తి పవిత్రమైనదని సమాజాన్ని తీర్చిదిద్దేది టీచర్లేనన్నారు. బోధనతో పాటు క్రమశిక్షణ నేర్పాలన్నారు. నిపుణులు చెప్పే ప్రతి అంశాన్ని ఆకళింపు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈవో ప్రేమ్‌కుమార్, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు. శిక్షణకు జోన్‌లోని మూడు జిల్లాల్లో మొత్తం 2,430 మందికి గాను 2411 మంది టీచర్లు హాజరయ్యారని ఆర్జేడీ తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చూసి ఓర్వలేక వైసీపీ కుట్రలు, కుతంత్రాలు చేస్తోందని, ఈ చర్యలను ప్రజలు తిప్పికొట్టాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాకలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరాన్ని ఐటి హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంటే, మరో పక్క గూగుల్ సంస్థకు కేటాయించిన భూముల విషయంలో బినామీ పేర్లతో కేసులు వేయించి ఐటి ప్రాజెక్టులను అడ్డుకునేందుకు వైసీపీ చూస్తోందని ఆరోపించారు. రాజకీయాల్లో కొనసాగే హక్కు వైసీపీ నాయకులకు లేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీలను ప్రభుత్వ అమలు చేస్తోందని అన్నారు. గాజువాక ఆటో డ్రైవర్లకు 'ఆటో డ్రైవర్ల సేవ' కార్యక్రమం శనివారం ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్, నాయకులు హాజీ, హుస్సేన్, గోమాడ వాసు, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కనకదుర్గ అమ్మవారి తెప్పోత్సవం



తెప్పోత్సవానికి లాంచీ పై వెళుతున్న భక్తులు, లాంచీలో అమ్మవారి విగ్రహం

మల్కాపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : యారాడ కొండపై వెలసిన సాగర గిరి కనక దుర్గా అమ్మవారి తెప్పోత్సవం వైభవంగా జరిగింది. శుక్రవారం సాయంత్రం ఈ తెప్పోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉన్న అమ్మవారి విగ్రహాలను ఊరేగింపుగా పల్లకిలో తీసుకువచ్చి లాంచీలో భక్తిశ్రద్ధలతో తెప్పోత్సవం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

తెప్పోత్సవం ప్రత్యేకత

సాగర గిరి కనక దుర్గా అమ్మవారి విగ్రహాలు ఎక్కడైతే లభించాయో అక్కడి వరకూ లాంచీలో ఊరేగింపుగా వెళ్లి సముద్రపునీటితో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం అమ్మవారిని సాగర గిరికి తీసుకువచ్చి యథావిధిగా విగ్రహ ప్రతిష్ఠ చేసి పూజలు చేస్తారు. దసరా నవరాత్రుల్లో అమ్మవారిని వివిధ అవతారాల్లో అలంకరించి ఆఖరి రోజున సాగరి గిరి కనకదుర్గ అమ్మవారిగానే అలంకరించాక తెప్పోత్సవం చేయడం పూర్వం నుంచి వస్తున్న ఆచారంగా వస్తోంది.

కలప దుకాణంలో అగ్ని ప్రమాదం

- స్థానికుల అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం
- సుమారు రూ.10 లక్షల ఆస్తి నష్టం

వెంకోజీపాలెం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : అందరూ నిద్రలోకి జారుకుంటున్న సమయం.. అంతా చీకటిగా ఉండే ప్రాంతంలో ఒక ఎర్రటి వెలుగు స్థానికులకు కనిపించింది. ఏమిటా అన్న అనుమానంతో వెళ్లి చూస్తే తలుపులు, చెక్కలు దుకాణం అగ్నికి ఆహుతి అవుతోంది. వెంటనే స్థానికులు దుకాణ యజమానితో పాటు అగ్నిమాపక సిబ్బందికి కూడా సమాచారం అందించడం, వారికి సహాయం చేయడంతో ఒక్క దుకాణంతో మంటలను ఆపగలిగారు. గ్రేటర్ పరిధిలోని 15వ వార్డు పాతవెంకోజీపాలెం స్మశాన వాటిక వద్ద రోడ్డు పక్కనున్న తలుపులు, కిటికీలు, చెక్కలు దుకాణాల వద్ద శుక్రవారం అర్ధరాత్రి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. సకాలంలో స్థానికులు గమనించడంతో పెను ప్రమాదం తప్పింది. ఇక్కడ ప్రక్కపక్కనే నాలుగు దుకాణాలు ఉన్నాయి. అయితే వీటిలో చివరిదైన కూఆర్ మోహన్‌కు చెందిన దుకాణం మంటలకు ఆహుతైంది. లోపలున్న చెక్కలు, తలుపులు, గ్లాసు మెటీరియల్, మెషినరీ కూడా కాగి బూడిదయ్యాయి. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది రావడంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఇక్కడి స్మశానంలో నిత్యం రాత్రి పూట గంజాయి బ్యాచ్ తిరుగుతూ, ఆకతాయి చేష్టలకు పాల్పడుతుంటారని, వాళ్లే ఈ మంటలను అంటించి ఉంటారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సూర్యాబాగ్ అగ్నిమాపక సిబ్బంది కేసు నమోదు చేసుకున్నారు. రాత్రి పూట కావడం, దుకాణాలు మూసి ఉండడంతో ఎవరికీ ఎటువంటి ప్రమాదం సంభవించలేదని, కేవలం ఆస్తి నష్టం మాత్రం జరిగిందని, సుమారుగా రూ.10 లక్షలకు పైగా ఆస్తి నష్టం ఉంటుందని అగ్ని మాపక సిబ్బంది అంచనా వేస్తున్నారు.


బీజాపూర్ జిల్లాలో లొంగిపోయిన మావోయిస్టులు

ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు గిరిజనుల హత్య

- మావోయిస్టుల ఘాతుకం
- బీజాపూర్ జిల్లాలో లొంగిపోయిన 103మంది మావోయిస్టులు

చర్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, సుకుమా జిలాల్లో మావోయిస్టులు ఇద్దరు గిరిజనులను హత్య చేశారు. బీజాపూర్ జిల్లా పూజారి కాంకేర్ గ్రామానికి చెందిన మడకం భీమా(45)ను మావోయిస్టులు గురువారం అతని ఇంటి ఆవరణలోనే దారుణంగా కత్తులతో పొడిచి చంపేశారు. భీమా 2018లో తెలంగాణలోకి వెళ్లిపోయి, ములుగు జిల్లాలో ఓ ఎస్ఐతో కలిసి పని చేశాడని, గ్రామంలో పోలీస్ క్యాంప్ పెట్టిన తరువాత తిరిగి వచ్చి, ప్రజలను బెదిరిస్తూ, రూ.లక్షలు దోచుకుంటున్నాడని, భూములు ఆక్రమిస్తున్నాడని అందుకే హత్య చేశామని మావోయిస్టులు ఓ లేఖలో పేర్కొన్నారు. అలాగే సుకుమా జిల్లా కిష్టారం అడవుల్లో ఓ గిరిజనుడిని మావోయిస్టులు హతమార్చారు. ఇదిలా ఉంటే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం గంగలూరు అడవుల్లో గురువారం సాయంత్రం ఎన్‌కౌంటర్ జరిగింది. ఒక మావోయిస్టు చనిపోయాడు. మరోవైపు, బీజాపూర్ జిల్లా పోలీసులు ఎదుట గురువారం 103 మంది మావోయిస్టు పార్టీ సభ్యులు లొంగిపోయారు. వీరిలో 22 మంది మహిళలున్నారు. లొంగి పోయిన వారిలో 47మందిపై మొత్తం కలిపి రూ.1.06కోట్ల రివార్డులున్నట్టు ఎస్పీ జితేంద్ర యాదవ్ తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 421మంది మావోయిస్టులు అరెస్టయ్యారని, 410 మంది లొంగి పోయారని, 137 మంది ఎన్‌కౌంటర్లలో మృతి చెందారని వెల్లడించారు.

అసభ్య పోస్టుల కేసులో అంజద్ బాషా పీఏ అరెస్టు

- కడప కోర్టులో హాజరు.. బెయిల్ మంజూరు

కడప క్రైం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కడప ఎమ్మెల్యే ఆర్.మాధవిపై అసభ్య పదజాలంతో ఉన్న వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసిన కేసులో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పీఏ షేక్ మహ్మద్‌ఖాజాను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం అతన్ని కడప ఎక్సైజ్ కోర్టులో హాజరు పరచగా.. సొంత పూచీకత్తుపై అతనికి కోర్టు బెయిలు మంజూరు చేసింది. ఆ వివరాలను కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, వన్‌టౌన్ సీఐ రామకృష్ణ విలేకరులకు వివరించారు. కడప అక్బర్ వీధికి చెందిన షేక్ మహ్మద్ ఖాజా మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు పీఏగా పనిచేస్తున్నాడు. 2024 ఎన్నికల సమయంలో ప్రస్తుత కడప ఎమ్మెల్యే మాధవి, ఆమె భర్త శ్రీనివాసరెడ్డిపై కడప అలంఖాన్‌పల్లెకు చెందిన విజయలక్ష్మి అసభ్యకరంగా మాట్లాడారు. ఆ వీడియోను అంజద్‌బాషా అతని సోదరుడు అహ్మద్‌బాషా ప్రోద్బలంతో సోషల్ మీడియాలో షేక్ మహ్మద్‌ఖాజా పోస్టు చేశాడు. ఈ వీడియో వైరల్ కావడంతో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు అంజద్‌బాషా, అహ్మద్‌బాషా, షేక్ మహ్మద్‌ఖాజాలపై కేసు నమోదు చేశారు. షేక్ మహ్మద్ ఖాజాను బుధవారం హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. గురువారం కోర్టులో హాజరు పరిచారు. ఎవరైనా సోషల్ మీడియాలో అసభ్యకరమైన వీడియోలు పోస్టు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

'సిట్' ముందు హాజరైన మిథున్‌రెడ్డి

విజయవాడ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో నిందితుడిగా ఉన్న రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి విజయవాడలోని సిట్ అధికారుల ముందు శుక్రవారం హాజరయ్యారు. ప్రతి సోమవారం, శుక్రవారం సిట్ అధికారుల ముందు హాజరవ్వాలని కోర్టు బెయిల్ ఉత్తర్వుల్లో షరతు విధించింది. దాని ప్రకారం మిథున్‌రెడ్డి సిట్ కార్యాలయానికి వచ్చి పుస్తకాల్లో సంతకం చేశారు. ఇటీవలే ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం నుంచి విడుదలైన విషయం తెలిసిందే.


సర్జరీ సిస్టమ్‌ను ప్రారంభిస్తున్న సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యుడు చక్రవర్తి, పక్కన సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ తదితరులు

'సత్యసాయి' ఆస్పత్రిలో రోబోటిక్ సర్జరీ సేవలు

- గుండె, యూరాలజీ విభాగంలో అందుబాటులోకి సేవలు

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అత్యాధునిక రోబోటిక్ సర్జరీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. రూ.8 కోట్ల విలువైన అత్యాధునిక రోబోటిక్ సర్జరీ వ్యవస్థను సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, సభ్యుడు చక్రవర్తి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ, భగవాన్ సత్యసాయి ధ్యేయమైన విలువలు, కరుణ, ప్రేమతో కూడిన అత్యాధునిక వైద్యాన్ని ఉచితంగా అందుబాటులోకి తెచ్చామన్నారు. ఎస్ఎస్ ఇన్నొవేషన్స్ అనే భారతీయ సంస్థ ప్రపంచ స్థాయి ప్రమాణాలకు తగ్గట్లు ఈ రోబోటిక్ శస్త్ర చికిత్స వ్యవస్థను అభివృద్ధి చేసిందన్నారు. ఈ వ్యవస్థతో శరీరంలోని సున్నితమైన ప్రాంతాలకు కూడా అత్యంత కచ్చితత్వంతో, సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలను సులభతరంగా చేయవచ్చని వెల్లడించారు. రోబోటిక్ సర్జరీకి రూ.లక్షలు ఖర్చు అవుతుందని, కానీ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పూర్తి ఉచితంగా అందుతుందని స్పష్టం చేశారు.


రోబోటిక్ సర్జరీ యంత్రాలు

ములకలచెరువు కేంద్రంగా నకిలీ మద్యం తయారీ

- రూ.1.75 కోట్ల విలువైన నకిలీ మద్యం స్వాధీనం
- స్పిరిట్, బాటిళ్లు, పరికరాలు సీజ్.. 9 మంది అరెస్టు


నకిలీ మద్యాన్ని తయారు చేస్తున్న దృశ్యం.. స్వాధీనం చేసుకున్న నకిలీ మద్యం బాక్సులు

రాయచోటి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ములకలచెరువులో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు దాడులు జరిపి రూ.1.75కోట్ల విలువైన నకిలీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కడప ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. అనంతరం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. విజయవాడకు చెందిన జనార్దన్‌రావు, ఆయన అనుచరుడు రాజు ములకలచెరువుకు సమీపంలోని కనుగొండ ఆర్చి సమీపంలో ఉన్న పాత డాబాను అద్దెకు తీసుకుని నకిలీ మద్యం తయారు చేస్తున్నారు. ఈ మద్యాన్ని వాహనం ద్వారా తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ ధర కంటే తక్కువకే ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పలు ప్రభుత్వ మద్యం షాపులకు కూడా ఈ మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. ఇటీవల జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పెద్దతిప్ప సముద్రం మండలంలో తనిఖీలు నిర్వహిస్తూ.. నకిలీ మద్యం తీసుకెళ్తున్న వాహనాన్ని నిలిపారు. బాటిళ్ల మీద ఉన్న లేబుల్‌ను స్కాన్ చేశారు. అయితే స్కాన్ కాకపోవడంతో అనుమానం వచ్చి విషయాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారంపై ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్‌దేవ్‌కు ఫిర్యాదులు అందడంతో అధికారులు గత నాలుగు రోజులుగా నిఘా ఉంచి శుక్రవారం ఈ దాడులు చేశారు. 15 వేల నకిలీ మద్యం బాటిళ్లు, 1050 లీటర్ల స్పిరిట్ క్యాన్లు, 1500 లీటర్ల బ్లెండ్(తయారైన నకిలీ మద్యం), 10 వేల ఖాళీ మద్యం బాటిళ్లు, 4 వేల మద్యం సీసా మూతలు.. స్టిక్కర్లు, మద్యం బాటిళ్లు తయారు చేసే పరికరాలు, ఇతర సామగ్రి, నకిలీ మద్యం సరఫరా చేసే వాహనాన్ని సీజ్ చేశారు. తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరికి చెందిన మరిమారన్, తిరుపత్తూరుకు చెందిన సురేశ్, సూర్య, ఆనందన్, ఒడిశా రాష్ట్రం బ్రహ్మపూర్‌కు చెందిన ఆనంద్ దాస్, మిథున్, విశాఖపట్నానికి చెందిన సయ్యద్ అలీ, వాహన డ్రైవర్ బాలరాజు, నకిలీ మద్యం కలిగి ఉన్న బెల్ట్ షాపు నిర్వాహకుడు రంగసముద్రానికి చెందిన నాగరాజు, పెద్దతిప్ప సముద్రంలోని మద్యం దుకాణ నిర్వాహకుడు టీడీపీ నేత కట్టా సురేంద్రనాయుడును అరెస్టు చేశారు. విజయవాడకు చెందిన జనార్దన్‌రావు, అతని అనుచరుడు రాజు, ములకలచెరువులోని రాక్‌స్టార్ ప్రభుత్వ మద్యం దుకాణ నిర్వాహకుడు రాజేశ్ తదితరులపైనా కేసు నమోదు చేశారు.

నిందితుల్లో తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి పీఏ


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

రాజేశ్ తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పీఏగా పనిచేస్తున్నారు. ఇతని పేరుతో ఉన్న వాహనం ద్వారానే నకిలీ మద్యం సరఫరా చేస్తున్నారు. దీనిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఈ నకిలీ మద్యం తయారీ వెనుక తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ముఖ్య నాయకుల సమీప బంధువుల ప్రమేయం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ నకిలీ మద్యం తయారీలో జిల్లాలోని పలువురు టీడీపీ నాయకుల హస్తం ఉన్నట్టు కూడా ఆరోపణలు వినిస్తున్నాయి. నియోజకవర్గంలోని పలు బెల్ట్‌షాపులు, ప్రభుత్వ మద్యం దుకాణాల్లోనూ ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు.

గ్యాంగ్ రేప్ కేసు నిందితులకు రిమాండ్

- గత నెల 25న చిత్తూరు సమీపంలో బాలికపై అఘాయిత్యం

చిత్తూరు అర్బన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల చిత్తూరులో ఇంటర్ విద్యార్థినిపై గ్యాంగ్ రేప్‌కు పాల్పడిన ముగ్గురు యువకులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ సాయినాథ్ మీడియాకు వివరించారు. గత నెల 25వ తేదీన చిత్తూరు నగర సమీపంలో ఉన్న నీవా నగర వనం పార్కుకు వచ్చిన యువ జంటను ముగ్గురు యువకులు బెదిరించారు. బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ జంటలోని యువకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 29వ తేదీన పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితులైన మహేష్, కిశోర్, హేమంత్‌ను శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ముగ్గురు నిందితులకు పోక్సో కోర్టు ఈ నెల 16 వరకు రిమాండ్ విధించింది. నిందితుల్లో ఒకరైన మహేష్ ఓ బాలికను ఈవ్ టీజింగ్ చేసిన కేసులో నిందితుడిగా ఉన్నాడు. కిశోర్ 2022లో నగరంలోని ఓ వైన్ షాపులో పనిచేస్తుండగా అక్కడి మద్యాన్ని బ్లాక్‌లో విక్రయించాడని అతనిపై కేసు నమోదైంది. కాలక్షేపం కోసం పార్కులకు వచ్చే ప్రేమ జంటలను లక్ష్యంగా చేసుకుని వారు కలిసున్న దృశ్యాలను వీడియో తీసి వారిని బెదిరించడం.. వారి వద్ద ఉన్న నగదు, బంగారాన్ని లాక్కోవడం.. లైంగిక వేధింపులకు పాల్పడటం.. వీరి నేర ప్రవృత్తిగా పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. కాగా.. నిందితుల్ని స్థానిక డీపీవో కార్యాలయం నుంచి అర కిలో మీటరు దూరంలో ఉన్న కోర్టు వరకు బేడీలు వేసి రోడ్డుపై నడిపించుకుంటూ తీసుకెళ్లారు.

హోటల్ సిబ్బందిపై వైసీపీ నేత నాగార్జున యాదవ్ దాడి

- అల్పాహారం ఆలస్యంగా ఇచ్చారని దౌర్జన్యం
- ఇరువురికి గాయాలు.. కేసు నమోదు


హోటల్ యజమాని కొడుకు ప్రేమ్‌కుమార్


హోటల్ యజమానిపై దౌర్జన్యం చేస్తున్న వైసీపీ నాయకుడు యనమల నాగార్జునయాదవ్

సత్తెనపల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అల్పాహారం తీసుకురావడంలో ఆలస్యం అయిందని హోటల్ యజమాని, సిబ్బందిపై వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్ అతని అనుచరులు రెచ్చిపోయారు. వారిపై దాడి చేసి గాయపర్చారు. ఈ దాడి ఘటన గురువారం రాత్రి పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని తాలూకాసెంటర్‌లో జరిగింది. రాత్రి 10 గంటల సమయంలో నాగార్జున యాదవ్ అతని అనుచరులు పట్టణంలోని గుడ్‌మార్నింగ్ హోటల్‌కు టిఫిన్ చేసేందుకు వచ్చారు. టిఫిన్ అందించడం ఆలస్యమవుతుందని నాగార్జునయాదవ్ అతని అనుచరులు గొడవకు దిగారు. హోటల్ యజమాని శేఖర్, అతని కుమారుడు ప్రేమ్‌కుమార్, వర్కర్ నాగేశ్వరరావుపై దాడి చేశారు. ఈ ఘటనలో ప్రేమ్‌కుమార్, వర్కర్‌కు గాయాలయ్యాయి. తనతో పెట్టుకుంటే అబ్బూరు ఊరు ఊరంతా కదిలొస్తుందంటూ హోటల్ యజమాని శేఖర్‌ను నాగార్జున యాదవ్ బెదిరించారు. దాడి ఘటనపై హోటల్ యజమాని శేఖర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.


గాలుల ధాటికి ద్వారకానగర్‌లో కూలిపోయిన హోర్డింగు, విద్యుత్ బాక్స్


బిర్లా జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై కూలిపోయిన చెట్టు


చెట్ల తొలగింపు పనులు పర్యవేక్షిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

ఈదురుగాలుల బీభత్సం

నగరంలో గురువారం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. భారీ వృక్షాలు నేలకొరిగాయి. హుద్‌హుద్‌ను తలపించేలా వీచిన గాలుల ధాటికి జనం భయాందోళనకు గురయ్యారు. విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. - ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం

పెట్టుబడులు అడ్డుకునేందుకు వైసీపీ కుట్ర

- విశాఖకు గూగుల్ రావడం ఖాయం
- భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

విశాఖపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా వైసీపీ నేతలు కుట్ర చేస్తున్నారని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి వైసీపీ అడ్డంకులు సృష్టిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం 15 నెలల్లో రూ.12 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించడాన్ని జీర్ణించుకోలేకపోతోందన్నారు. సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి లోకేశ్ సింగపూర్ పర్యటనలో ఉండగా ఏపీలో పెట్టుబడులు పెట్టవద్దంటూ మురళీకృష్ణ అనే వ్యక్తి ద్వారా వైసీపీ నేతలు సింగపూర్ ప్రభుత్వానికి మెయిల్స్ పంపించారని ఆరోపించారు. విశాఖలో టీసీఎస్‌కు ఎకరా 99 పైసలకు ఇస్తే బినామీలతో కోర్టులో కేసు వేయించి న్యాయమూర్తితో మొట్టికాయలు వేయించుకున్న సంగతి తెలిసిందేనన్నారు. ఆసియాలో అతిపెద్ద గూగుల్ సెంటర్ విశాఖకు తెచ్చేందుకు సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి లోకేశ్ కృషి చేస్తుంటే దానినీ అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వైసీపీ అధికారంలో ఉండగా కీలకంగా వ్యవహరించిన ఓ ఐఏఎస్ అధికారి ఆనందపురం, భీమిలి, పద్మనాభం, పెందుర్తి మండలాల్లో 300 ఎకరాలకు పైగా డీపట్టా భూములకు అడ్వాన్సులు ఇచ్చి భారీ కుంభకోణానికి తెర తీశారన్నారు. తర్లువాడలో గూగుల్‌కు 200 ఎకరాలు భూసేకరణ ముగిసిన తరుణంలో ఆ అధికారి బినామీ రైతులకు తెలియకుండా కోర్టులో కేసు వేశారన్నారు. అందులో మరణించిన రైతు పేరు కూడా చేర్చడంతో కుట్ర బహిర్గతమైందన్నారు. అక్కడ ఎకరం ధర రూ.17 లక్షలుండగారైతుల అభ్యర్థన మేరకు రూ.20 లక్షలు ఇవ్వడానికి ప్రభుత్వం అంగీకరించిందన్నారు. రూ.55వేల కోట్లతో ప్రతిపాదించిన గూగుల్ డేటా సెంటర్‌తో విశాఖ ముఖచిత్రం మారుతుందన్నారు. వైసీపీ కుట్రలు చేసినా గూగుల్ రావడం తథ్యమన్నారు.

సింహగిరిపై భక్తిశ్రద్ధలతో శమీ పూజ


జమ్మి చెట్టుకు పూజలు చేస్తున్న అర్చకులు


పూజల్లో పాల్గొన్న ఈవో, తదితరులు

సింహాచలం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): చెడుపై మంచి విజయం సాధించిన గుర్తుగా విజయదశమి రోజున సింహగిరిపై భక్తిశ్రద్ధలతో శమీపూజోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. వరాహలక్ష్మీనృసింహ స్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఒకచేతిలో విల్లు, మరో చేతిలో శరం, మొలలో బాకు, ఖడ్గం ధరించి దుష్ట సంహారానికి వెడలిన శ్రీరాముడిగా అలంకరించారు. సుప్రభాత సేవతో స్వామిని మేల్కొలిపి ప్రభాత ఆరాధనలు సేవల అనంతరం ఆస్థానమండపంలో వేదికపై అధిష్ఠింపజేశారు. భారీ వర్షం కారణంగా మెట్లమార్గం అనువుగా లేకపోవడంతో ఉత్సవాన్ని సింహగిరిపై జరిపారు. స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో ప్రధానార్చకులు కరి సీతారామాచార్యులు శమీపూజకు శ్రీకారం చుట్టారు. నృసింహమండపంలో పవిత్ర శమీ (జమ్మిచెట్టు) వృక్షానికి ప్రోక్షణ, పూజలు చేసి, సంప్రదాయబద్ధంగా జమ్మివేట నిర్వహించారు. షోడశోపచార పూజల అనంతరం భక్తితో శమీ పత్రాలను శిరస్సున దాల్చారు. పండితులు వేదపారాయణలు చేశారు. ఉత్సవంలో ఈవో త్రినాథరావు, అధికారులు వెంకటరమణ, తిరుమలేశ్వరరావు, సూర్యకళ, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

బవేరియా దొంగల ముఠా సభ్యుడి అరెస్టు

- దేశంలోనే అత్యంత ప్రమాదకరమైన గ్యాంగ్
- నిందితుడిపై దేశవ్యాప్తంగా 24 కేసులు
- గత నెల 17న నగరంలో వరుస చోరీలు
- వివరాలు వెల్లడించిన డీసీపీ లతా మాధురి



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ లతా మాధురి

మహారాణిపేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో వరుస చైన్ స్నాచింగ్‌లకు పాల్పడిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన బవేరియా ముఠా సభ్యుడిని అరెస్టు చేసినట్టు డీసీపీ లతామాధురి తెలిపారు. నగర పోలీస్ కమిషనరేట్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలను వెల్లడించారు. గత నెల 17వ తేదీన నగరంలోని వన్‌టౌన్, కంచరపాలెం, షీలానగర్ తదతర ప్రాంతాల్లో వరుసగా ఏడు చైన్‌స్నాచింగ్‌లు జరిగాయి. ఈ ఘటనతో ఉలిక్కిపడిన పోలీసులు దర్యాప్తునకు ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దింపారు. ఆ బృందం అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి ఉత్తరప్రదేశ్‌లోని షామ్లీ జిల్లాకు చెందిన ధర్మేంద్రకుమార్, సూరజ్, కపిల్, హజారేసింగ్‌లు చోరీలకు పాల్పడినట్టు గుర్తించారు. వీరంతా దేశంలోనే అత్యంత ప్రమాదకరమైన బవేరియా ముఠాకు చెందినవారని తేల్చారు. ప్రత్యేక బృందంలోని అధికారులు వ్యూహాత్మకంగా వ్యవహరించి నిందితుడు ధర్మేంద్రకుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి, అతడిని శుక్రవారం నగరానికి రప్పించి, అరెస్టు చేశారు. ముఠాలోని నలుగురు సభ్యులు గత నెల 17న ఢిల్లీ నుంచి ఏపీ ఎక్స్‌ప్రెస్‌లో విశాఖ చేరుకున్నారు. ఉదయం అల్లిపురం, మహారాణిపేటలో రెండు ద్విచక్రవాహనాలను దొంగతనం చేసి, వాటిని పూర్ణామార్కెట్ వద్ద దాచి ఉంచారు. సాయంత్రం 6 నుంచి 9 గంటల మధ్య వన్‌టౌన్, కంచరపాలెం, షీలానగర్ ప్రాంతాల్లో వరుసగా ఏడు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డారు అనంతరం రాత్రి ఊర్వశి జంక్షన్ వద్ద చోరీ చేస్తుండగా కపిల్, సూరజ్‌లను పట్టుకునేందుకు స్థానికులు వెంబడించారు. దీంతో నిందితులు వాహనం వదలి పారిపోయారు. అదే రోజు రాత్రి 10.30 గంటలకు దువ్వాడ స్టేషన్‌లో రైలు ఎక్కి పరారయ్యారు. వరుస చోరీల్లో ప్రధాన నిందితుడు ధర్మేంద్రకుమార్‌గా పోలీసులు గుర్తించారు. ఇతడిపై జమ్ముకశ్మీర్‌లో 9, ఢిల్లీలో ఒకటి, యూపీలో 11, ఒడిశాలో మూడు కేసులున్నాయన్నారు. విశాఖలో ఏడు చైన్ స్నాచింగ్, రెండు బైక్ చోరీ కేసులు నమోదయ్యాయన్నారు. గ్యాంగ్‌స్టర్ క్రిమినల్‌గా ముద్రపడిన ఇతడిపై దేశవ్యాప్తంగా మొత్తం 24 కేసులున్నట్టు డీసీపీ వివరించారు. బవేరియా గ్యాంగ్ దేశంలోనే అత్యంత ప్రమాదకరమైనదని, ఈ ముఠా సభ్యులు మారణాయుధాలతో చోరీలకు పాల్పడతారన్నారు. నిందితుడు ధర్మేంద్రకుమార్‌ను విచారించామని, మిగిలిన ముగ్గురి వివరాలను సేకరించామన్నారు. ఈ కేసులో అత్యంత తెలివిగా వ్యవహరించి నిందితుడ్ని అరెస్టు చేసిన వెస్ట్ ఇన్‌స్పెక్టర్ మీసాల చంద్రమౌళి, ఎస్ఐ షేక్‌అబ్దుల్ మరూఫ్, ఇతర సభ్యులను ఆమె అభినందించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి


అబ్దుల్ ఖాదర్ (ఫైల్)

మురళీనగర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన పాత ఐటీఐ కూడలిలో జరిగింది. కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఐటీఐ జంక్షన్ గణేష్‌నగర్‌లో నివసిస్తున్న డ్రైవర్ అబ్దుల్‌ఖాదర్ (52) బుధవారం రాత్రి ఇంటికి వెళ్తుండగా మద్దిలపాలెం డిపోనకు చెందిన బస్సు ఢీ కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతు గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య రజియా బేగం, కుమార్తె ఉన్నారు. ట్రాఫిక్ సీఐ దాశరధి ఎస్ఐ కె.శ్రీనివాసరావు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు యువకుల ఆత్మహత్య

ఎంవీపీ కాలనీ/ఆనందపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు కారణాలతో ఇద్ద రు యువకులు విభిన్న ప్రాంతాల్లో ఆత్మ హత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నక్కవానిపాలేనికి చెందిన షేక్ మహ్మద్ రసూల్ (33) ఐటీ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి అప్పులపాలయ్యాడు. గురువారం రాత్రి భోజనం చేసి మేడపై గదిలో నిద్రించేందుకు వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం ఎనిమిది గంటలైనా కిందకి రాకపోవడంతో సోదరుడు ఫరీద్ తలుపులు పగులగొట్టి చూసేసరికి ఫ్యానుకు ఉరివేసుకుని ఉన్నాడు. ఉద్యోగంలో ఒత్తిడి, మానసిక సమస్యలతో ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని తల్లి ఫాతిమా ఫిర్యాదు చేసింది. కాగా ఆనందపురం మండలం గిడిజాల పంచాయతీకి చెందిన యువకుడు గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్టు సీఐ చింతా వాసునాయుడు తెలిపారు. డ్రైవర్‌గా పనిచేసే కోరాడ సంతోష్ (36) మద్యానికి బానిసయ్యాడు. భార్యతో తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో బుధవారం భార్యతో గొడవ పడ్డాడు. రాత్రి 10 గంటలకు ఇంట్లో ఉన్న గడ్డి మందు మద్యంలో కలిపి తాగేశాడు. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.

ప్రాణం తీసిన విద్యుత్ తీగ


ఈశ్వరరావు మృతదేహం

కంచరపాలెం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): భారీ గాలులకు తెగిపడిన విద్యుత్ తీగ నిండు ప్రాణాన్ని బలిగొంది. ఈ సంఘటన గురువారం గాంధీనగర్ వద్ద జరిగింది. ఈ ప్రాంతానికి చెందిన బత్తైన ఈశ్వరరావు (52) మెట్టు వద్ద ముత్యాలమ్మ గుడి ఎదురుగా టీ దుకాణం నిర్వహిస్తున్నాడు. దసరా సందర్భంగా గురువారం ఉదయం 11 గంటలకు దుకాణానికి మామిడి తోరణాలు కడుతున్నాడు. అదే సమయంలో వీచిన ఈదరుగాలులకు సమీపంలోని హెచ్‌టీ విద్యుత్ తీగ తెగిపడి ఈశ్వరరావుపై పడింది. దీంతో కుప్పకూలిపోయాడు. వెంటనే అతడి భార్య ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందాడని వైద్యులు తెలిపారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కంచరపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అదే సమయంలో దుకాణం వద్ద ఉన్న శ్రీనివాస్ తీవ్రంగా గాయపడ్డాడు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి


విజయలక్ష్మి (ఫైల్)

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత మృతిచెందింది. ఈ సంఘటన నక్కవానిపాలెం పీఅండ్‌టీ కాలనీలో జరిగింది. ఎస్ఐ ధనుంజయనాయుడు తెలిపిన వివరాల ప్రకారం కాలనీలో నివసిస్తున్న గుడ్ల భాస్కరరావు గురువారం రాత్రి ఏడు గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అతడి భార్య విజయలక్ష్మి(40) ఇంట్లోకి వెళ్లి గడియ వేసుకున్నారు. రాత్రి తొమ్మిది గంటలకు కుమారుడు వచ్చి తలుపుతట్టినా తెరవకపోవడంతో, తండ్రికి ఫోన్ చేశాడు. స్థానికుల సాయంతో తలుపులు పగులగొట్టి చూడగా, విజయలక్ష్మి అపస్మారక స్థితిలో పడి ఉంది. ఆస్పత్రికి తరలించగా వైద్యులు మృతి చెందినట్టు ధ్రువీకరించారు. తన భార్య తొమ్మిది రోజులుగా ఉపవాసాలు చేస్తోందని, ఆస్తమా, లోబీపీతో బాధపడుతోందని భాస్కరరావు చెబుతున్నాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ కేవీఎస్‌వీ ప్రసాద్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేశారు.